హనీబీఎపి

జనవరి - మార్చి 2008

# పల్లెసృజన

సంపుటి 2, సంచిక 3

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక





## ఆసు మిషన్ సృష్టికర్త చింతకింది మల్లేశం



చేతితో ఆసుపోస్తున్న సాలింటి ఆడపడుచు

# పల్లె సృజన

సంపుటి 2, సంచిక 3 జనవరి - మార్చి 2008

**సంపాదక వర్గం**

సంపాదకుడు :
**డా. కె.ఎల్. రావు**

ఉప సంపాదకులు :
**శ్రీమతి అరుణ గణేశం**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్తా**
**డా. గీర్వాణి**
**డా. వై.వి. రావ్**
**శ్రీ పి. చంద్రకాంత్ శర్మ**
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**
**పి. వీరరాఘవ రెడ్డి**

డి.టి.పి. & డిజైనింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్,** హైదరాబాద్
ఫోన్ : 040-30627739
సెల్ : 93913 75655, 92468 20655

ఎడిటోరియల్ అడ్రస్ :
పల్లెసృజన - శ్రీమతి పి. అరుణ
102, వాయుపురి, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27118555
E-mail : honeybeeap@gmail.com

## ఈ సంచికలో....

అందరికీ పసందైన పల్లె జీవితం 3
ఆసుమిషన్‌తో చేనేతకారుల కష్టాల్ని కడతేర్చిన మల్లేశం 5
ఇతర రాష్ట్రాల పల్లె జ్ఞాన కబుర్లు 9
వెంకట కృష్ణ మరో సృజనాత్మక సృష్టి - సంహారిణి 13
ఏకలవ్యుడు రాంబాబుకు అరుదైన సన్మానం 16
అనుకూల వాహనంతో వ్యాపారం ముమ్మరం 18
కాశ్మీరు శోధయాత్ర 19
నరసింహాచారి ట్యూబ్‌లైట్లకు నిజామాబాద్ డిపిఓ సహకారం 22
అరకు లోయలో శోధయాత్ర సన్నాహాలు 23

**కవర్ లోపలి పేజీల్లో.....**

**'హనీబీఏపి' ప్రగతి**

అనుభవం నేర్పిన పాఠంతో రైతుకు ఆదా

**రమణారెడ్డి 'ట్రాక్టర్ కల్టివేటర్'**

## Honey Bee Regional Collaborators & Publications

**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015.
Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash**
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
45, TPM Nagar,
Virattipathu - 625 010. Tamilnadu
E-mail : numvali@vsnl.com

**Loksarvani (Gujarati) and**
**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte (Malayalam)**
**James T J,**
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in

Printed & Published by : Dr. K.L. Rao, on behalf of "Honey BeeAP" 102, Vayupuri, Secunderabad - 500 094. A.P. Ph.: 040-27118555, Cell : 0 98660 01678. Printed at : Narendra Grafix, Chikkadpally, Hyderabad. Ph. : 30627739.

# సంపాదకీయం



మూడు దశాబ్దాల క్రితం వరకు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నైపుణ్యానికి ప్రోత్సాహం లభించేది. అందువల్లే ఎన్నో పనిముట్లు తయారయయినాయి. నిర్మాణాలు జరిగాయి. మూలికావైద్యంలో ప్రయోగాలు చాలామందికి అందగల్గినాయి. ఐరోపాలో పారిశ్రామిక విప్లవం వచ్చిన తర్వాత పాశ్చాత్య మోజులో  సృజనాత్మకత ప్రోత్సాహం తగ్గింది. అనుకరణ అవాటయింది. ఆ రోజుల్లో సృజనాత్మకతకు గల గుర్తింపుతో ఇన్నోవేటర్లు సమాజానికి ఎంతో జ్ఞాన సంపదను అందించారు. ఎవరు, ఎప్పుడు ఈ కృషిలో పాల్గొన్నారో ఎవరా ఫలితాన్నిచ్చారో కూడా తెలియదు.

కొన్ని ఉదాహరణలు :

చెకుముకిరాయి, ఢిల్లీలో అశోకా స్థంభం, దీపస్తంభం (లైట్‌హౌజ్), అద్దం, గాజులు, తబలా, హార్మోనియం, వీణ, గోలకొండ కోటపైకి నీటి సరఫరా, జయపూర్, ఢిల్లీ, వారణాసిలలో నక్షత్రశాల, కాశ్మీరు నివాసులు కోటలో ఉష్ణం ఉంచడానికి దాచుకునే పొయ్యి, మూడు సంవత్సరాల వరకు నిల్వ చేసే కూరగాయలు, శిల్పాలకు వేసే రంగులు ఇలా ఎన్నో వేల ఇన్నోవేషన్లు అందించిన జ్ఞాన సంపదతో సమాజం ముందుకు సాగింది. ఇప్పుడు కూడా అదే స్ఫూర్తితో ఇన్నోవేటర్లు చేసే పనికి ప్రోత్సాహం కలిగజేస్తున్నాము. సమాఖ్య ఉద్దేశ్యాలు నాలుగు. 1. జ్ఞాన సంపద సృష్టించిన వారికి (ఇన్నోవేటర్లకు) గుర్తింపు కల్గించుట. 2. ఇన్నోవేటర్లకు జీవనోపాధి లేదా పారితోషికం ఏర్పాటు చేయుట.3. సమాజానికి ఈ జ్ఞాన సంపదనందించుట. 4. పేటెంటు కోసం ప్రయత్నం. ఈ నాలుగు విధాలా చేసే ప్రయత్నంలో మన రాష్ట్రం ముందుందని నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారు ప్రశంసించారు.

గ్రామాల్లోని సాంకేతిక ఆవిష్కరణలను, సాంప్రదాయ పరిజ్ఞానాన్ని శోధించే ఆరవ జాతీయ ద్వైవార్షిక పోటీలకు ఎంట్రీలు తక్కువగా ఉన్నాయి. డిశంబర్ 2008 ఆఖరు తేది సమీపిస్తున్నది. కావున వీలైనంత త్వరలో మీకు తెలిసిన గ్రామీణ జ్ఞానానికి సంబంధించిన వివరాలను తెలియజేయ గలరు. మినీ శోధయాత్రలు, స్టూడెంట్ క్లబ్బులు, గ్రామీణ ప్రదర్శనల్లో పాల్గొనడం లాంటి కార్యక్రమాల్లో మీరు చేయూతనిస్తారని, తద్వారా మన ఆశయ సాధనకు కృషి చేస్తారని ఆశిస్తున్నాము.

మీ స్పందనలు, ఆలోచనలు, గ్రామీణ జ్ఞాన సంపదను గురించి, వాటిని వెలికి తీసే పద్ధతులను గురించి మీ దృక్పథాలను మాకు పంపించండి. మేము యధాతథంగా ప్రచురిస్తాం. మీ అందరి సహకారం ఈ జ్ఞాన సముపార్జన యజ్ఞంలో ఉంటుందని మనసారా ఆశిస్తూ....

శుభాభినందనలతో...

**డా॥ కె.ఎల్. రావు,**

ఎడిటర్.

## గ్రామీణ సృజనా శక్తి వేదిక ‘పల్లెసృజన’

‘పల్లెసృజన’ ఒక వేదికగా ఉపయోగపడాలంటే మీరు మీ సమస్యలను, ఆలోచనలను, జ్ఞాన సంపదను సంకోచించకుండా పంపండి. ఎంత చిన్న ఆలోచన అయినా సరే మేము ఆహ్వానిస్తాము. ప్రతి సంచికలో ఉత్తమ ఎంట్రీకి ఉచిత వార్షిక సభ్యత్వం ఇవ్వబడుతుంది. మీ సమస్యలను ‘పల్లెసృజన’లో ప్రచురిస్తాం. వాటి సమాధానాలు పాఠకులు పంపితే వాటిని కూడా ప్రచురిస్తాం. మీరంతా సహకరించి ఈ గ్రామీణ సృజనాశక్తి వెలుగుదారుల వేదికను సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నాం. ప్రార్థిస్తున్నాం.

-సంపాదకవర్గం.



# అందరికీ పసందైన పల్లె జీవితం

## అందకుండా పోతుందా?

– ***దంటు నాగమణి,*** *తెలుగు ఉపాధ్యాయిని, హైదరాబాద్.*

**ఇప్పటికి మా పల్లెను వదిలి 30 సంవత్సరాలు దాటింది. కరణంగారి ఇట్లో పున్నాగ చెట్టు, ఆ పూలతో జడల మాల అల్లటం, గోదావరి గట్టు, ఇసకదిబ్బలు, మాలక్ష్మమ్మ గుడి, దగ్గరగా రావిచెట్టు, వీధులలో తిరిగే ఆవుల మందలు, ఇళ్ళముందు రంగవల్లులు, చుట్టూ కొండలు, బారులు తీరి ఆకాశంలో ఎగిరే రకరకాల పక్షులు, కోయ తండాల 'రేల రేల' పాటలు, మాలక్ష్మమ్మ జాతరలు ఇవన్నీ ఇప్పటికీ నా కళ్ళముందు మెదులుతూనే వుంటాయి.**

ఆ రోజులు ఎంత ప్రశాంతంగా సాగేవి. ఫ్యాక్టరీల రొదలు, వాహనాల మోతలు, రైళ్ళ రద్దీలు, ఇవేవీ లేని ప్రశాంత జీవనం. మళ్ళీ ఆరోజులు పొందగలమా?

పల్లెల్లో ఎంతటి సహకారం! అక్కడ కూడా ఉన్నవాళ్ళు, లేనివాళ్ళు ఉన్నారు. కానీ, అందరూ ఆప్యాయంగా పలకరించుకుంటారు. వరసలు పెట్టి పిలుచుకుంటారు. ఒకరి కష్ట సుఖాల్లో మరొకరు పాలుపంచుకుంటారు. ఆ పల్లెల్లో ఏ సంగతి జరిగినా నిమిషాల్లో ఊరంతా తెలుస్తుంది. అందుకే అంతా జాగ్రత్తగా వుంటారు. చెడు జరగటానికి అంతగా అవకాశాలు వుండవు.

ఈ పట్నవాసాల ధోరణులే వేరు. పక్కనగాని, ఎదురుగా గాని, ఏం జరిగిందో ఎవరికీ తెలియదు. ఎవర్ని అవరూ పట్టించుకోరు. ఏదైనా చెడు జరిగితే అది తమదాకా రాకుండా మాత్రమే జాగ్రత్త పడతారు. మంచి జరిగితే, 'ఎవరింట్లోనో ఏదో జరుగుతోంది. మనకేమిటి సంబంధం' అని తలుపులు వేసుకుని టి.వితో కాలక్షేపం చేస్తూ వుంటారు.



ఆ పల్లె ప్రజల సహకారం, సమైక్యత అద్భుతం. పాడి పశువులు అన్నీ ఒకేసారి పాలు ఇవ్వవు. ఒకరింట్లో పాడి ఆవు చూడు కడితే మరొకరింట్లో వట్టిపోయిన గేదె వుంటుంది. కొందరి ఇంట్లో పాడి పశువులు పుష్కలంగా పాలు ఇస్తుంటే వేరొకరింట్లో అసలు పాడి పశువులే వుండవు. అలాంటప్పుడు పాడిలేనివారు పాలు, మజ్జిగ కొనుక్కోవటం అతి కష్టంగా వుంటుంది. అప్పట్లో కొందరు జొన్నన్నం వండుకునేవారు. అదెంతో ఆరోగ్యకరం కూడా. ముందుగా జొన్నలు నానబెట్టి కడిగి రోట్లో వేసి దంపుకునేవారు. ఆ దంపిన జొన్నలు కడగగా వచ్చిన కుడితిని పాడిగల ఇళ్ళకు వెళ్ళి వారికుడి తొట్లో పోసి ఆ యింటివారు ఇచ్చే కాసిని పాలు, కాస్త మజ్జిగా తీసుకుని ఇంట్లో వాడుకునే వారు. ఈ విధంగా పాడిలేనివారు ఆ కుడితి వృధాగా పోనీయకుండా పాడి పశువులకు ఉపయోగించి వారుకూడా లాభం పొందేవారు.

ఒకరి పొలంలో కందులు పండేవి. మరొకరి పొలంలో శనగలు పండేవి. ఒకరి పొలంలో వేరుశనగ పండితే వేరొకరి పొలంలో మిరపకాయలు పండేవి. ఇలా రకరాల పంటలు వేర్వేరు పొలాల్లో పండితే, వారు ఆప్యాయంగా ఆ పంటను పండించని వారికి పంచేవారు. వారిచ్చే ధాన్యాలను వీరు పుచ్చుకునేవారు. ఇటువంటి సహకారం ఈ రోజులలో ఈ పట్నాలలో ఎక్కడైనా కనిపిస్తుందా?

శ్రీరామ నవమి వచ్చినా, వినాయక చవితి వచ్చినా, ఎవరింట్లో ఏ శుభకార్యం జరిగినా, ప్రకృతిలో సహజంగా దొరికే తాటి, కొబ్బరి ఆకులతో విశాలమైన చలువ పందిళ్ళు వేసి, నెలల తరబడి వుంచేవారు. ఎండకు, వానకు, బాధపడకుండా నీడనిస్తాయి కదా! నేడు లక్షలు వెచ్చిస్తేకాని ఏ కళ్యాణ మంటపం అందుబాటులో వుండటం లేదు. పెరళ్ళలో పండే కూరగాయలు ఆ శుభకార్యాల విందు భోజనాలకు అక్కడకు వచ్చేవి.

ఊళ్ళో నలుగురూ ఏకమై ఏ పనైనా నిర్వర్తించేవారు. శుభకార్యాలకు నాలుగైదు రోళ్ళు చలువ పందిళ్ళ కింద, చెట్లకింద వేసుకుని పిళ్ళు, కారాలు, పసుపు - కుంకుమలు, అటుకులు మొదలైనవి దంచేవాళ్ళు పదిమంది కలిసి పిండివంటలు తయారు చేసేవారు. అప్పడాలు, వడియాలు చేసేవారు. పందిళ్ళు వేసి మామిడి తోరణాలు అంకరించేవారు. "దేవుని పెళ్ళికి ఊరంతా పెద్దలే" అని అన్ని పనులూ అందరూ చేసేవారు. పెద్దల పట్ల గౌరవం, పిన్నల పట్ల ఆప్యాయానురాగాలు అక్కడ దొరికేవి.



అట్లతద్ది వచ్చిందంటే చాలు ఊరు నిండా ఉయ్యాలలే. తెల్లవారుఝామునే లేచి చద్ది భోజనం చేసి, ఆటలు మొదలు పెడతారు. తెలతెలవారుతుండగా ఇళ్ళకు చేరి తలంటు స్నానం చేసి, పూజ చేసి వాయనాలు పంచుకుంటారు. ఆ సందడికి, ఆ సంతోషానికి హద్దులే లేవు. మరీ వయసు మళ్ళినవారు వామన గుంటలు, అష్టాచెమ్మ, పేకాటలతో తెల్లవారు ఝాము గడిపేరు.

ఎండాకాలం గోదావరి నీరు ఎండి ఇసుక దిబ్బలు తేలేవి. నీరు చాలా దూరంలో వుండేది. అంతదూరం వెళ్ళి ఇంటికి సరిపడా నీళ్ళు తెచ్చుకోవటం చాలా కష్టంగా వుండేది. అందుకు ఇసుకను త్రవ్వి గోతులు చేస్తే ఆ గోతులలో నీరు ఊరేది వాటిని 'చలమలు' అంటారు. ఆ నీటిని తెచ్చుకొని వాడుకొనే వారు. ఆ చలమలు తవ్వటం చాలా సరదాగా వుండేది. అందులో ఊరిన నీటిని చూస్తూ వుంటే ఏదో ఘనకార్యం చేసినంత ఆనందం.

ఏ ఇంట్లో ఎవరు అనారోగ్యంతో బాధపడుతున్నా, ఏ గర్భిణీ స్త్రీ ప్రసవ వేదన అనుభవిస్తున్నా అర్ధరాత్రి, అపరాత్రి అనకుండా డాక్టర్లు, మంత్రసానులు అవసర సమయంలో ఆదుకునేవారు. ఆ ఒక్క వైద్యుడే ఏ విధమైన 'టెస్టు'లు లేకుండా చేతి నాడి చూసి వైద్యం చేసేవాడు. తన సంచిలో వున్న గుళికలతోను, చుట్టుప్రక్కల దొరికే మూలికలతోను, చక్కని వైద్యం చేసి తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పి, పథ్యం ఎప్పుడు తినాలి? ఏవి తినాలి? ఏవి తినకూడదు అని అన్నీ వివరించి చెప్పేవాడు.

నేడు ఒక అనారోగ్యానికి వంద టెస్టులు, వందమంది డాక్టర్లు, కన్సల్టేషన్లు, వేలు, లక్షల కొద్దీ రూపాయలు, దానితో 'టెన్షన్' అనే కొత్త వ్యాధి సంక్రమిస్తుంది.

నాకు మళ్ళీ ఆవూరు వెళ్ళి చూడాలని వుంది. ఆ దోగావరి తల్లి ఒడిలో జలకాలాడాలని వుంది. ఆ కొండలు, గుట్టలు తిరగాలని వుంది. ఆప్యాయంగా అందరినీ పలకరించాలని వుంది. అవన్నీ ఇప్పుడు సాధ్యమేనా? పల్లెలు పట్నాలుగా మారిపోతున్నాయి. సిటీ సంస్కృతి అన్నిచోట్లా వ్యాపించింది. ముఖ్యంగా మనిషిలో స్వార్థం వెర్రితలలు వేస్తోంది. నా జ్ఞాపకాల కోవెలలో మిగిలిన ఆ తీపి గురులు చేదిరిపోవు కదా! ●



# ‘ఆసు మిషన్’తో చేనేతకారుల కష్టాల్ని కడతేర్చిన మల్లేశం

**నాపేరు మల్లేశం. మాది నల్గొండ జిల్లా, ఆలేరు మండలంలోని ‘శారాజీపేట’ అనే ఓ చిన్న గ్రామం. నేను ఆరవ తరగతి వరకు చదివి మా కులవృత్తి రీత్యా మగ్గం నేయటం మొదలు పెట్టాను. రాత్రి సమయంలో చదువుతూ 7వ తరగతి ప్రైవేట్‌గా పరీక్ష రాసి పాసయ్యాను. ఆ తర్వాత పదవ తరగతి చదవాలన్న కోరికతో రాత్రి వేళల్లో ట్యూషన్ చదివి 10వ తరగతి పరీక్ష రాసాను. 8, 9 తరగతులు చదవని కారణంగా పరీక్షలో ఉత్తీర్ణుడను కాలేక పోయాను మూడవసారి ప్రయత్నంలో మొత్తానికి పదవ తరగతి పాసయ్యాను. ఇక అక్కడితో చదువును ఆపాల్సిన కుటుంబ పరిస్థితులు మావి.**

**ఆసు మిషన్ చేయటానికి కారణం :**

వేము చేనేత కుటుంబానికి చెందినవాళ్ళం కాబట్టి మగ్గం నేయటం మా వృత్తి. రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితి. కాబట్టి మా తల్లిదండ్రులు ఆరవ తరగతి నుండే మగ్గం నేయటం నేర్పించారు. అలా మగ్గం నేస్తూ చదువుకున్నాను. మేము చేసే చేనేత చీరలు “పోచంపల్లి టై &డై’ కి సంబంధించిన పట్టుచీరలు. ఈ చీరల తయారీకి ‘ఆసు పోయటం’ అనే పని వుంటుంది. ఇది చీర నేయటానికి చాలా ముఖ్యమైనది. చీరపై వచ్చే డిజైన్ అంతా దీనిపైనే ఆధారపడి వుంటుంది. ఈ పనిని మహిళలే చేస్తారు. మా ఇంట్లో మా అమ్మ చేస్తూ వుండేది. అయితే ఒక్కో చీరకు కనీసం 9,000 సార్లు చెయ్యిని వెనక్కి ముందుకి ఆడించవలసి వుంటుంది. అంతే కాదు, ఆసు పోసే పోగులను కూడా సరిగ్గా గుర్తుంచుకోవలసి వుంటుంది. ఇలా ఒక చీరకు ఆసు పోయాటానికి దాదాపు 5 గంటల సమయం పట్టేది. అంటే రోజుకు కనీసం రెండు చీరలయినా ఆసు పోయాల్సి వుంటుంది. అంటే 18,000 చేతిని వెనక్కి – ముందుకి ఆడించాల్సి వచ్చేది ఈ పని చేయటం వల్ల మా అమ్మ చాలా ఆయాస పడుతూ చేతిని పట్టుకుని చాలా బాధపడుతూ ఈ ఆసు పోయటం నావల్ల కాదు, మీరు మగ్గాలు నేయటం మాని వేరే ఏదైనా పని చూసుకోండి అని అంటుండేది.



మగ్గం నేయటం ఇబ్బందైన పనేం కాదు కాబట్టి కేవలం ఆసు పోయటం గురించి వృత్తి మానేయటం ఎందుకు? ఈ ఆసు పోయటానికి మార్గం కనిపెడితే ఇలాగే బ్రతకవచ్చు కదా! అన్న ఆలోచనే ఈ 'ఆసు యంత్రం తయారీకి నాంది. ఎలాగైనా ఆసుపోసే యంత్రాన్ని తయారు చేయాలని నిర్ణయించు కున్నాను. మగ్గానికి బదులుగా మర మగ్గం వుంది. ఈ ఆసు పోయాటానికి కూడా మోటారు బిగించి ఆసు పోసే విధంగా ఓ యంత్రాన్ని తయారు చేయాలనే కోరిక కలిగింది. అప్పటికి నా వయసు 20 సంవత్సరాలు. నేను ఇంటినుండి బయటకు వెళ్ళే వాడిని కాదు. సాంకేతికంగా నాకే పరిజ్ఞానమూ లేదు. కానీ మనసులో మాత్రం బలమైన కోరిక ఉంది. యంత్రాన్ని కనిపెట్టడానికి నన్ను ఉసి గొల్పింది నా 'బలమైన కోర్కే'. అదే నన్ను ముందుకు నడిపించింది. మగ్గం నేస్తూనే కొన్ని కొన్ని పరికరాలు తెచ్చి వాటిని కట్టెలతో ఒక ఫ్రేమ్ మాదిరిగా చేయించి ఈ పరికరాలు వాటికి బిగించాను. మొదటగా కొన్ని భాగాలుగా విభజించాను. మొదటి భాగంపూర్తి చేశాను. దీంతో చేతిలో డబ్బులు అయిపోయాయి. నాకు ఏయే పరికరాలో ఉపయోగించాలో తెలీక అన్ని రకాల పరికరాలు తెచ్చి డబ్బును చాలా వృధా చేశాను. అలా మళ్ళీ డబ్బు జమ కాగానే రాత్రి వేళల్లో పని చేస్తూ పోయాను.

అప్పటికి 4 సంవత్సరాలు గడిచి పోయాయి. నా వయసు 24 సంవత్సరాలు, నాకు పెండ్లి చేశారు. దీంతో సంవత్సరం వరకు దాని జోలికి పోలేదు. ఈ సంవత్సర కాలంలో నాలో ఆలోచనలు పెరిగాయి, గట్టి నమ్మకం కుదిరింది. కాని ఇప్పుడు డబ్బు కావాలి. ఎలా అని ఆలోచించాను. నా భార్య వద్ద వున్న తన పుట్టింటి డబ్బుతో కొన్ని పరికరాలు తెచ్చి వాటిని బిగించాను. దాంతో మూడు భాగాలు పూర్తయ్యాయి. ఇంక రెండు భాగాలు పూర్తి చేయాలి, మళ్లీ డబ్బు సమస్య – మగ్గం నేయటం మానేసి అప్పుకోసం తిరిగాను – ఎక్కడా ఎవరి సహకారమూ అందలేదు. దానికి కారణం మా వృత్తిలో మేము బ్రతకటమే కష్టం ఇక అప్పులెలా తీరుస్తారు? అన్నదే పెద్ద ప్రశ్న. అయినా సరే మిషన్ తయారీ పట్టుదల మాత్రం నాలో సడల లేదు. ఎందరినో అడిగితే ఏ కొందరైనా అప్పు ఇవ్వకపోతారా? అని తిరగగా, కొందరు సహృదయంతో అప్పు ఇచ్చారు. ఆ డబ్బుతో కొన్ని పరికరాలు తెచ్చి వాటిని బిగించుకుంటూ పోయాను. ఇంకా కొన్ని పరికరాలు లేవు అవి ఎలాంటి పరికరాలో కూడా తెలియడం లేదు. అంటే ఇంకా కొంత టెక్నాలజీ అవసరమైంది. అక్కడితో మిషన్ ఆపలేక హైదరాబాద్ వెళ్ళి చాలా షాపుల ముందు నాకు అవసరమైన పరికరాలేమైనా కన్పిస్తాయేమోనని చూశాను. కొన్ని రోజులు చూడగా కొన్ని వస్తువులు దొరికాయి. వాటిని తెచ్చి బిగించాను.

అప్పటికే ఇంట్లో వాళ్ళకు విసుగ నిపించి, నీవు మిషన్ తయారు చేయకున్నా ఫరవాలేదు, అప్పులు ఇచ్చిన వాళ్ళు ఇంటిమీద పడతారు మనం రోడ్డున పడకముందే మగ్గం నేయటం మొదలు పెట్టమన్నారు. ముందు అప్పులు త్వరగా తీర్చు. మనలాంటి వాళ్ళం ఇలాంటి మిషన్ల తయారీకి పూనుకో కూడదన్నారు. నీకు చదువు లేదు, ఎక్కడా చూడని, ఇలాంటి వాటిని ఇంజనీర్లు తయారు చేస్తారు. మనకు వద్దు అన్నారు నాన్నగారు. మీ అమ్మకు ఆసు పోయటం చేత గాకపోతే వేరే పనేదైనా చూసుకుందామన్నారు. అప్పుల పాలు చేసి కుటుంబాన్ని పాడు చేయకు, నిన్ను నీ భార్యను మేమిలా చూడలేము మగ్గం నేయటం ప్రారంభించు అని చెప్పారు. అప్పులు ఇచ్చిన వాళ్ళు కూడా అడగటం మొదలు పెట్టారు.

ఊళ్ళోనివారు, బంధువులు కూడా నీకు పని చేయడం చేతగాక ఇది చేస్తాను అది చేస్తాను అని పని తప్పించుకు తిరుగుతున్నావు, మీ అమ్మ తప్ప ఈ లోకంలో ఎవ్వరూ ఆసు వెయ్యడం లేదా? వాళ్ళకు చేతులు నొప్పి పుట్టడం లేదా? అని నా మనసును గాయడం చేయటం ప్రారంభించారు. ఇక ఇక్కడ వుంటే ఈ అప్పులు తీరవు, ప్రోత్సాహం కూడా కరువవతుంది అని ఆలోచించి అంతవరకు తయారు చేసిన మిషన్‌ను ఒక రూంలో వుంచి, హైదరాబాద్ చేరుకున్నాను.

అక్కడ ఒక ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ వద్ద రోజువారి వేతనం ప్రకారం పనిచేసుకుంటూ ఒక సంవత్సరం వరకు కొన్ని డబ్బులు ఇంటికి పంపేవాన్ని. ఊళ్లో వున్న మిషన్‌ను తెచ్చి హైదరాబాద్‌లో నేను వుంటున్న రూంలోనే బిగించుకున్నాను. నాకు ఈ మిషన్‌ను విజయవంతంగా తయారు చేయాలన్న కోరిక మాత్రం పోలేదు. పార్ట్‌టైంలో ఉద్యోగం చేసుకుంటూ కొంత కొంత డబ్బును జమ చేసుకుంటూ పరికరాలు తేవటం, వాటిని బిగించటం మొదలు పెట్టాను. అది చివరి దశకు చేరుకుంది. కానీ, ఒక్క చిన్న కదలికని మిషన్‌లో ఎలా అమర్చాలో తెలీక ఆగిపోయింది. ఇందుకు



చాలా రోజుల సమయమే తీసుకుంది. ఈ మిషన్‌లో ఇదే అసలైన టెక్నిక్ ఒక కొయ్యకు దారం తగులుకొని జారి కిందకు రావాలి.

రోజులాగే నా ఉద్యోగాని వెళ్ళాను. ఆరోజే నా ప్రయత్నం ఓ మలుపు తిరిగింది. ఆరోజు బాలానగర్‌లోని ఒక ఫ్యాక్టరీలో పని చేయటానికి వెళ్ళాను. ఆ ఫ్యాక్టరీలో పలు రకాల మిషన్‌లున్నాయి. అవి చూడగానే వాటిని గమనిస్తూ చూడటం మొదలు పెట్టాను. మా షావుకారు నన్ను చూసి, నీవు పని చేయడానికి వచ్చావా? లేక మిషన్‌లు చూడటానికి వచ్చావా అని గద్దించాడు. ఆయనకు తగిన సమాధానం చెప్తూనే మిషన్‌లోని ప్రతి పార్ట్ ఎలా పని చేస్తుందో గమనించసాగాను. అందులో నాకు కావలసిన ఒక టెక్నిక్‌ను గుర్తించాను. వెంటనే మా షావుకారుకు చెప్పి నేను ఇంటికి వెళ్తాను సార్ ఈరోజు డబ్బులు నాకవసరం లేదు అని ఒక వర్క్ షాప్‌కు వెళ్ళి నాకు కావలసిన విధంగా ఒక పరికరాన్ని చేయించుకున్నాను. దానిని మిషన్‌కు బిగించి మెల్లగా తిప్పుతూ దారాన్ని చుట్టి చూసాను నాకు కావలసిన విధంగా అది పనిచేసింది. మర్నాడు మిషన్‌ను విప్పదీసుకుని ఆలేరులో వుంటున్న మా మిత్రుడి వద్దకు వెళ్ళి మిషన్‌ను బిగించి ఆసు పోసి ఇచ్చాను. దాన్ని మగ్గం వేసి చూశాడు. దాన్ని అతడు చూసి ఇది చాలా బాగుంది, చేతితో చేసిన దానికంటే బాగా వచ్చింది అన్నాడు. చుట్టు ప్రక్కల వారు అందరూ జాతరగా వచ్చి చూడటం మొదలు పెట్టారు.

నలభై ఏళ్ళ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా ఆసుపోయటానికి ఒక మిషన్ తయారయ్యింది. చుట్టు ప్రక్కల గ్రామాల వారు వచ్చి మిషన్‌ను చూసి చాలా బాగుంది, ఇలాంటి మిషన్ మాకూ ఒకటి తయారు చేసి ఇవ్వమని అడగటం మొదలు పెట్టారు. అప్పుడు నా ఆలోచనలు మరో రూపు దాల్చాయి. ఈ మిషన్‌ను నేను మాత్రమే ఉపయోగించుకోకుండా మిషన్‌లను తయారు చేసి అందరికీ అమ్మితే ఇదే నా వృత్తిగా మారుతుంది, ఎంతోమంది చేనేత కార్మికులకు మేలు చేసిన వాడినవుతానని అనిపించింది. నేను తయారు చేసిన ఆ మిషన్‌పై అందరూ ఆసు పోయడం నేర్చుకున్నారు. అంటే నాకు చాలా సంతోషంగా అనిపించింది. నా తల్లి పడిన కష్టాలు ఎవ్వరూ పడకూడదని అనిపించింది. చిన్నగా ఒక వర్క్‌షాప్ పెట్టి నేను, నా తమ్ముడు, మా నాన్న, మా కుటుంబ సభ్యులు ఈ వ్యవస్థను కాపాడుకుంటున్నాం. ఈ 'టై & డై' వ్యవస్థలో ఓ నూతన విప్లవానికి నేను కారణమయ్యానన్న తృప్తితో నా మనసు నిండిపోయింది. ఈ మిషన్ రావడంతో ప్రతి నేత కార్మికుడు కొనలేక పోయినా కొందరు ఈ మిషన్‌ను తీసుకుని కేవలం ఆసు పోయడమే వృత్తిగా చేసుకుని జీవనం సాగించడం నాకెంతో తృప్తినిచ్చింది.

నల్గొండ జిల్లాలోని దాదాపు అన్ని గ్రామాలు, వరంగల్ జిల్లాలోని కొన్ని గ్రామాలు, ఒరిస్సా రాష్ట్రంలోని కటక్ జిల్లా నూవ పట్నం లో నేను తయారు చేసిన మిషన్లు ఉన్నాయి. ఒక్క నల్గొండ జిల్లాలోనే దాదాపు 40 వేల కుటుంబాలు మగ్గంపై ఆధారపడి బ్రతుకున్నవి. జిల్లాలోని పోచంపల్లి, చౌటుప్పల్, పుట్టపాక, గట్టుప్పల్, చండూర్, నారాయణపురం, వెలివెల్లి, మునుగోడు, చిట్యాల, రామన్నపేట, వలిగొండ, మోత్కూర్, భువనగిరి, యాదగిరి గుట్ట, రాజపేట మండలాల్లో ఇప్పటివరకు 500 మిషన్లను తయారు చేసి ఇవ్వడమైనది.

ఈ మిషన్ తయారయ్యేసరికి 2000 సంవత్సరం వచ్చింది. రూ. 13,000/–ల విలువతో 2005 వరకు ఈ మిషన్‌లను తయారు చేసి ఇవ్వటం జరిగింది. అప్పుడు స్టీల్ ధర పెరగడంతో కిలో స్టీర్ ధర రూ. 14/– నుండి ఒకేసారి రెట్టింపయి రూ. 28/–లకు చేరుకుంది. దాంతో మిషన్ ధర కూడా రూ. 26,000/–లు చెయ్యవలసి వచ్చింది. కాని అంత ఖరీదు పెట్టి మిషన్ కొనే శక్తి నేత కార్మికులకు లేదు. కాని, మిషన్ అవసరం తప్పనిసరి అయ్యింది. ఇలాంటి



పరిస్థితుల్లో మిషన్‌లో మార్పులు చేయాల్సిన అవసరం తప్పనిసరిగా మారింది.

దీనికి పరిష్కారం కోసం దీర్ఘంగా ఆలోచించాను. ఈ మిషన్‌కు ఎలక్ట్రానిక్ మిషన్‌గా మారిస్తే ధర చాలావరకు తగ్గుతుందని గ్రహించాను. ఈ పరిష్కారానికై కొన్ని ఎలక్ట్రానిక్ సంబంధిత పుస్తకాలు చదివి నాకు తోచిన జ్ఞానంతో కొన్ని వస్తువులు కొని మిషన్‌ను ఎలక్ట్రానిక్ మిషన్‌గా అభివృద్ధి చేయడం జరిగింది. 2006 సంవత్సరం కల్లా మిషన్ పూర్తిగా ఎలక్ట్రానిక్ మిషన్‌గా తయారయింది. ఇప్పుడు అందరూ ఎలక్ట్రానిక్ మిషన్‌నే కొంటున్నారు. ఇప్పుడు దాని ధర రూ. 13,000/- లు మాత్రమే. మార్కెట్ ధరల్లో ఎంతో మార్పు జరిగినా, మిషన్ ఖరీదులో ఎలాంటి మార్పు లేకుండా అందివ్వగలగడం నాకెంతో సంతోషాన్నిచ్చింది. **- చింతకింది మల్లేశం.**

ఆసు పోయలేక మాలా పని మానుకోవాలని ఆలోచించే ఎంతో మందికి నేను మార్గదర్శిని కావడం, మళ్ళీ ఈ చేనేత పరిశ్రమను బ్రతికించడంలో ఉన్న ఆనందానికి మించినది ఏదైనా వుంటుందా?ఎందరో చేనేత కార్మికుల కుటుంబాల్లో ఆనందం నింపడం నాకెంతో తృప్తినిస్తోంది.

మల్లేశం సాధించిన విజయాన్ని తెలుసుకున్న 'పల్లెసృజన' ఆ మిషన్ గురించి తెలుసుకోవడానికి 'పోచంపల్లి' వెళ్ళడం జరిగింది. అక్కడ మల్లేశం చూపిన విధంగానే అక్కడి చేనేత కార్మికుల్లో ఈ మిషన్ రావడం వల్ల తమకెంత ఆసరానిచ్చిందో విన్న తర్వాత మల్లేశం తయారు చేసిన మిషన్ సామాన్యమైనది కాదనిపించింది. అక్కడి కార్మికులు ఎలా కష్ట పడ్డారో చూద్దామని ఓ చేనేత మహిళను కలిసి చూడగా (నేటికీ కొందరు చేతితోనే ఆసు పోస్తున్నారు) ఆసు పోస్తున్న ఆ మహిళను పక్కనుంచి హనీబీ కో-ఆర్డినేటర్ శ్రీ గణేశం గారు కొంతసేపు ఆసు పోయడం జరిగింది. ఆ తర్వాత అది ఎంత కష్టమో ఆయన వివరించారు. తను వేసిన కొద్ది పోగులలోనే తను ఏ కొయ్యకు దారం వేశాడో మరిచిపోయాడు అంటే ఆ పని ఎంత కష్టమో అర్థం చేసుకోవచ్చు.

ఆసు పని అయిన తర్వాత దానిపై చీరలో మనకు కావాల్సిన డిజైన్ గ్రాఫ్ ప్రకారం మిషన్‌పై వేసిన ఆసుపైన బొగ్గుతో గుర్తులుగా వేస్తారు. ఆ తర్వాత ఆ గుర్తులున్న చోట కావాల్సిన రంగు పడకుండా రబ్బర్‌తోను, దారంతోను మూసివేసి, కావాల్సిన రంగులో అద్దుతారు. ఆ తర్వాత ఆ దారాన్ని కండె రూపంలోకి మార్చుకొని, మగ్గంపై వాడతారు. అంటే ఇక్కడ ఆసు పోసిన దారం ద్వారానే మనకు కావాల్సిన డిజైన్‌లో చీర వుంటుంది.

ఇంతటి శారీరక శ్రమను తగ్గించి పని సామర్థ్యాన్ని పెంచేలా చేసిన ఈ 'ఆసు యంత్రం' నిజంగా చేనేత కార్మికుల పాలిట వరమే. దాన్ని సృష్టించిన మల్లేశంను చేనేత కార్మికులు ఎన్నటికీ మరచిపోలేరనేది నిర్వివాదాంశం. ఈ యంత్రం మరుగున పడబోతున్న 'టై & డై' పోచంపల్లి చీరల కథను జీవింపజేసిందంటే అతిశయోక్తి కాదు. సృజనా శక్తి సమస్య అవగాహన, పరిష్కారాన్ని సాధించాలన్న తపన, సమాజ కళ్యాణం చేయాలన్న ఆదర్శం - అన్నీ వున్న మల్లేశంను 'గ్రామీణ న్యూటన్'గా భావించవచ్చు కదా!

**- వీర రాఘవ రెడ్డి.**



## చేతితో - మిషన్‌పై ఆసు పోయడంలో గల తేడాలు

**చేతితో :**

- మహిళలు ఒక చీర ఆసు పోయాడానికి నాలుగు గంటల సమయం పడుతుంది.
- రోజుకు రెంచు చీరలు మాత్రమే ఆసు పోయాగలరు.
- ఏకాగ్రత, కంటిచూపు చాలా అవసరం.
- కంటిచూపు, చేతులు, మెడ, ఛాతి సంబంధించిన జబ్బులు రావచ్చు.
- ఒక చీరకు ఆసు పోయడం వల్ల రూ. 15/-ల కూలీ ఖర్చవుతుంది (ఒక మనిషి కూలీ రోజుకు రూ. 30/-లు అయినప్పుడు).
- చీరలపై కొన్ని డిజైన్‌లు మాత్రమే సాధ్యమౌను.

**మిషన్‌తో :**

- ఒక చీర ఆసు పోయడానికి సుమారు గం. 1-30ని. లు పడుతుంది.
- రోజుకు 8 చీరలు ఆసు పోయగలరు.
- ఏకాగ్రత అవసరం లేదు, ఇతర పనులు చేసుకోవచ్చు.
- మనిషికి ఏలాటి జబ్బులూ రావు.
- విద్యుత్ ఖర్చు ఒక రూపాయి మాత్రమే అవుతుంది. (0.25 హెచ్.పి. మోటారు సామర్థ్యంతో నడుస్తుంది).
- చీరలపై, అన్ని రకాల డిజైన్‌లు సాధ్యమౌతాయి.



# ఇతర రాష్ట్రాల పల్లెజ్ఞాన కబుర్లు

## నేలలో ఉప్పు తగ్గించటమెలా?

వరి పంట వేసే నేలలో వివిధ రకాల లవణాల పరిమాణం పంటపై చాలా ప్రభావాన్ని చూపుతుంది. ఈ లవణ పరిమాణాన్ని తగ్గించేందుకు శాస్త్రీయంగా చాలా ప్రయత్నాలు జరిగాయి. కానీ ఏవీ ఇంతవకు అద్భుతమైన ఫలితాలను సాధించలేదు. ఈ లవణ పరిమాణాన్ని తగ్గించేందుకు ఆఫ్రికా దేశంలోని



'ఫిరాంగ్'లో కొందరు రైతులు ఒక ప్రయోగాన్ని చేసి విజయం సాధించారు. అది – సున్నము + తవుడు (వరి పొట్టు) + ఎండిన మామిడి ఆకులు కలిపి పొడి చేసి, నారు వేసే సమయానికి ముందే నేలలో కలిపి బాగా కలియదున్నాలి. ఈ విధంగా చేయడం వల్ల మంచి ఫలితాన్నిచ్చి పంట ఏపుగా పెరుగటమే కాక, పంట దిగుబడి కూడా పెరుగుతుంది. ఇప్పుడు ఈ ప్రయోగాన్ని అక్కడి చాలామంది రైతులు ఉపయోగిస్తున్నారు. మన ప్రాంతం రైతులు కూడా ఈ ప్రయోగాన్ని చేసి వరి పంట దిగుబడిని పెంచితే బాగుంటుంది.

## పశువులకు జలుబు చేస్తే !

ఒరిస్సాలోని అంతర్యామిప్రధాన్ అనే రైతు సాంప్రదాయ రీతిలో పశువులకు వైద్యం చేస్తారు. గొంతువాపు, ముక్కు కారడం,



నీరసంగా ఉండటం మొదలైన వ్యాధుల నివారణకు ఆయన మూలికా వైద్యం ఎంచుకున్నాడు. దీనికోసం ఆయన 50 గ్రా. పచ్చి మిరపకాయలు, 50 గ్రా. ఆవాలు, 100 గ్రా. అరటి కాండము, 50 గ్రా. లేత అరటి ఆకులు తీసుకుని వాటి మిశ్రమానికి రెండు చెంచాల నెయ్యి కలపాలి. ఈ మిశ్రమాన్ని వ్యాధి సోకిన పశువులచే త్రాగించాలి. ఆ తర్వాత ఈ లేపనాన్ని గొంతు క్రింద కూడా రాయాలి. నాలుగవ రోజు నుండి పశువు ఆరోగ్యంగా తిరుగుతుంది. ఆహారం తీసుకుంటుంది.

## పశువులలో అజీర్తి వ్యాధికి వైద్యం

పశువులు తరచుగా కొత్త / పచ్చి గడ్డి తిన్నప్పుడు అజీర్తి వ్యాధితో బాధపడుతుంటాయి.



అలాంటప్పుడు ఆహారం సరిగ్గా తీసుకోలేవు, నీరసంగా వుంటాయి. అలాంటప్పుడు సరోజ్‌కుమార్ బిస్వాల్ అనే ఒరిస్సాకు చెందిన రైతు 100 గ్రా. వంట సోడాను, 50 గ్రా. అల్లం పొడిని, 50 గ్రా. ఉప్పు తో జువాని పొడిని తీసుకుని గోరువెచ్చని నీటిలో కలిపి పశువులచే త్రాగిస్తారు. అలా 7-8 రోజుకు ఇస్తే వ్యాధి మటుమాయమౌతుందని బిస్వాల్ చెబుతున్నారు.

ఒరిస్సాకే చెందిన ఇంద్రమణి సాహు అనే రైతు మరో పద్ధతి కనుగొన్నాడు. ఇతను 200 గ్రా. కొత్తిమీర, 100 గ్రా. చింతపండు, 1 గ్రా. నల్ల మిరియాలు తీసుకుని మిశ్రమం చేసి ఈ లేపనాన్ని అర లీటరు నీటితో కలిపి పశువులకు



రెండు రోజులు పట్టిస్తే పశువులలో అజీర్తి వ్యాధి నయమవుతుందంటాడు.

## పాలిచ్చే పశువుల జబ్బులకు మందు

పాడి పశువులలో వచ్చే వైరల్ జబ్బులకు, దానివల్ల కలిగే అల్సర్ల వల్ల పాలిచ్చే పశువులకు వాంతులు అవుతుంటాయి. దీని నివారణకు విశ్వనాథ్ అనే ఒరిస్సా రైతు చాలా



సులువైన మందు కనిపెట్టాడు. అతను 250 మి.లీ. గాడిద పాలను తీసుకుని పశువులచేత త్రాగించేవాడు. ఇలా వారం రోజులు చేయాలి. ఈ విద్యను తన తాతగారి నుండి నేర్చుకున్నారు. వారి తాత గారు 50 సంవత్సరాలుగా ఇదే వైద్యం చేస్తున్నాడట!

## పశువులను వడదెబ్బనుండి కాపాడటం

ఒరిస్సాలోని చార్‌ఘర్ జిల్లాలో పలుమార్లు వేడిమి 48-50 డిగ్రీల వరకు వుంటుంది. నౌసారసరా గ్రామవాసి ఫకీర్ ప్రధాన్ ఆస్‌పరాగస్ అనే వనమూలికలను తన పశువులకు వడదెబ్బ తగులకుండా వుండటానికి



వాడేవాడు. వేసవిలో 200 గ్రా. మూలికల రసాన్ని నీటితో కలిపి రెండురోజులకోసారి త్రాగించేవాడు. ఆ రసాన్ని పశువులపైన కూడా చల్లేవాడు. ఇది జెర్సీ ఆవులపై బాగా పని చేస్తుంది. అవి ఎక్కువ వేడిని భరించలేవు.

## మానవ మూత్రంతో బయోగ్యాస్

పాఠశాలల్లో మూత్ర విసర్జనకు తగిన చోటు లేక దుర్వాసన, పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నవి. కొంతమంది మహిళలు దీనికి విరుగుడు కనిపెట్టారు. వారు పాఠశాలల నుండి మూత్రాన్ని ట్యాంకులో నింపి, దీనిని ఆవుపేడతో కలిపి బయోగ్యాస్ ప్లాంట్‌లో వాడినారు. ప్రస్తుతం వారు పూర్తిగా మానవ మూత్రంతోనే నడుపుతున్నారు. ఈ విధంగా పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించడం పాఠశాలకు కావలసిన శక్తిని సమకూర్చడంలో సఫలమైనారు. ఇది కేరళలో జరిగింది.

## మామిడిని పండించుటకు వేడినీటి ప్రయోగం

మామిడి కాయలను మామూలుగా పండించాలంటే 10 నుండి 12 రోజులు పడుతుంది. ఈ లోపల అవి పురుగుల బారిపడే అవకాశం వుంది. దీనిని నివారించడానికి వెంకటరమణ భట్ అనే అతను ఒక ఉపాయం కనుగొన్నాడు. మామిడి కాయలను వేడినీటిలో 60-65 డిగ్రీల వరకు 10-12 నిమిషాలు వుంచుతాడు. కాయపైన వున్న గుడ్లు నశిస్తాయి.ఆ తర్వాత వాటిని పండిస్తే, మామిడి పండ్లు తాజాగా వుంటాయి. ఇది కర్నాటక రాష్ట్రంలో చేయడం జరిగింది.

## మలేరియాకి మూలికా వైద్యం



ఒరిస్సాలోని బాగాపటేల్ అనే ఆసామి ఈ విధానాన్ని పాటిస్తున్నాడు. అతడు కొన్ని వనమూలికలను (ఇండియన్ చినోలియా, ఇక్సోరా, మల్లెమొక్క కాండము, వేప మొ.) 200 గ్రా. వనమూలికలను మట్టి కుండలో నీటితో కలిపి మరిగిస్తాడు. చల్లార్చిన ద్రావణాన్ని ప్రతిరోజు ముఖం కడిగిన తరువాత ఖాళీ కడుపుతో తాగుతాడు. ఇలా 15 రోజులు చేస్తే కనీసం 1 సం. వరకు మలేరియా బారిన పడరని అంటున్నాడు.

## పంట పొలాల్లో పీతలు బంద్ !

పంట పొలాల్లో పీతలు నేలలో రంధ్రాలు చేస్తాయి. దీనివల్ల పొలానికి కావలసిన నీరు అందక దిగుబడి తగ్గుతుంది. దీనిని అరికట్టడానికి కృష్ణమూర్తి గారు ఒక పథకం వేశారు. చెరువులు, పొలాల గట్లవెంట వుండే నీలి, ఆకుపచ్చ నాచును పీతలు వుండే ప్రదేశంలో వుంచి వాటి త్రోవను మూసివేస్తారు. ఈ నాచు ఘాటుకు పీతలు బయటకు రాలేవు. ఈ ప్రక్రియ వరి నాటు తరువాత నెలకు అంటే దాదాపు ఆగస్టులో చేపడతారు.

## పొంగు వ్యాధి నివారణ

పశువుల దాణాలో అప్పుడప్పుడు కొన్ని అవాంఛనీయ పదార్థాలు కలుస్తూ వుంటాయి. దానిని మేసిన పశువులు పొంగు వ్యాధి బారిన పడతాయి. దీంతో అవి నీరు త్రాగడం మానేసి



ఒకవైపు ఒరిగి పడుకుంటాయి. సరైన వైద్యం చేయకపోతే ప్రాణం పోయే ప్రమాదముంది. గుజరాత్‌లోని లాలుజ్ భాయి దీని నివారణకు మార్గం కనిపెట్టాడు. ఆయన 'రాక్సిబి' అనే ఆకులను 300 గ్రా. నీటిలో నానబెట్టి వాటిని పశువులచేత త్రాగిస్తారు. వ్యాధిబారిన పడిన పశువులు వెంటనే కోలుకుంటాయి.

## కలుపు మొక్కల నివారణ

యల్.సి. చిన్నరాజా అనే వ్యవసాయదారుడు కలుపు మొక్కల నివారణకు ఒక పద్ధతి కనిపెట్టాడు. డిసెంబర్ - జనవరి మాసాల్లో వేరొక రకపు కలుపు మొక్కలు (బర్డ్ ఫ్లవర్) గింజలను సేకరిస్తాడు. ఒక ఎకరానికి 3 కిలోల గింజలను అంతే ఇసుకతో కలిపి పొడిచేసి కలుపుతాడు. మొక్కలున్న ప్రదేశంలో వెదజల్లుతాడు. ఈ పొడి పెరిగే కలుపు మొక్కలను అరికడుతుంది.

## పరాన్నభుక్తుల నుంచి ఆవుల సంరక్షణ

కేరళలోని ఎ.వై. అజేష్ అనే వ్యక్తి తన ఆవులను క్రిమి కీటకాల బారినుండి రక్షించడానికి ఉపాయం కనుగొన్నారు. దీనికోసం ఆయన పానికూర్క అనే ఏపుగా పెరిగే మొక్కను ఎంచుకున్నారు. సాధారణంగా పశువులమీద క్రిమి సంహారక మందులు చల్లితే అవి వాటికి



హాని కలిగిస్తాయి. చెవులు ఆడించడం, వళ్ళు జలదరించడం వంటి వాటితో ఆ మందులు కడుపులో ప్రవేశించి దాని ఆరోగ్యాన్ని భంగం చేయవచ్చు. మందులు చల్లినా ఈ క్రిములు మళ్ళీ వస్తాయి. రసాయన మందులు ఎల్లకాలం పనిచేయవు. అతడు తన ఇంటిలోని మొక్క ఆకులను బాగా పిప్పి చేసి దానిని సబ్బు నీళ్ళలో కలిపి ఆవు వంటికి రాశాడు. దీనితో ఆవుకు వెంటనే ఉపశమనం కలిగింది. నెలదాటినా క్రిములు మళ్ళీ ఆవు దగ్గరకు రాలేదు.

## కీళ్ళ నొప్పులకు కషాయం

ఎలుకుట్టి జోసెఫ్ అనే వ్యక్తి కీళ్ళ నొప్పులకు ఒక కషాయం తయారు చేశాడు. దీనిలో అతడు మలబారు వక్క, అల్లం, కుమిన్,



కోకో గడ్డి, ప్లంచాగో, తేనెతుట్టె ముక్కలు ట్యూబరు, పాటారూట్ మొ. కలిపి 3 లీటర్ల నీటిలో 1 లీటరు పరిమాణం వచ్చే వరకు మరిగించారు. అందులో ఒక గ్లాసు ద్రావకాన్ని 3 ఔన్సులు వచ్చే వరకు మరిగించాడు. దినికి కాల్షియం క్లోరైడ్ కలిపి వ్యాధిగ్రస్తులకు ఇచ్చాడు.

## గాయాలకు మూలికా వైద్యం

గత 40 సంవత్సరాలనుండి తమిళనాడు లోని పొన్నుస్వామి అనే వ్యక్తి సిద్ధ అనే సంప్రదాయ వనమూలికల మందును తయారు చేస్తున్నాడు. అతనికి 10 సంవత్సరాల వయసులో కాళ్ళకు గాయమై విపరీతమైన బాధను అనుభవించాడు. ఆయన ఎక్కడ మొక్కలను చూసినా వాటిని నిశితంగా గమనించేవాడు. 1977లో అతను హార్ట్‌సీడ్ అనే



మొక్కపై పరీక్ష జరిపాడు. అందులోని జిగురు పదార్థం బాగా పనిచేసింది. ఆ సమయంలో ఆయన ముక్కు దిబ్బడ నుండి బాధ పడుతున్నారు. ఈ లేపనాన్ని వీపుమీద రాయగానే కొన్ని గంటలలోనే శ్వాస పీల్చుకోవడం సులభంగా జరిగింది. ఇది గ్యాస్ట్రిక్ ట్రబుల్ మీద కూడా బాగా పనిచేస్తుంది. 1977 నుండి 2005 వరకు ఆయన 3,000 మందికి పైగా ఈ లేపనాన్ని ఇచ్చారు. ఇది బాధా నివారిణిగా పనిచేస్తుంది. ఎటువంటి మరకలు పడవు.

గొర్రెలకు అతిసార వ్యాధి సోకినప్పుడు వాటికి గానుగ ఆకుల రసం ఇస్తున్నారు. ఆయన అమ్మన్ పచారసి అనేదాన్ని వాడి గొర్రెలలో పాలు ఎక్కువగా యిచ్చేటట్లు చేస్తున్నారు.

## కొబ్బరి చిప్పల తైలం

గోపాలకృష్ణన్‌కు తన పాఠశాల రోజుల నుండే వివిధ విషయాలపై ఆసక్తి వుండేది. అతను ఆర్థిక స్థోమత లేక విద్యాభ్యాసం పెద్దగా చేయలేదు. అతను ఆంధ్రప్రదేశ్‌లోని ఓ నూలు మిల్లులో టర్నర్ / వెల్డర్‌గా పని చేస్తున్నాడు.



నూలు వడకడంలో అతను శ్రమ శక్తిని తగ్గించే విధానాన్ని కనుగొన్నాడు. 2005వ సం.లో అతను కొబ్బరి చిప్పల తైలాన్ని ఎర్రచీమల పుట్టలపై చల్లాడు. ఇది చల్లిన 30 సెకండ్లలో వాటిని పాత్రోలింది. ఇది దాదాపు 35 రోజుల పాటు పని చేస్తుంది.

## గ్రుడ్లు మొక్కలకు కూడా పుష్టికరమే

గోపాలకృష్ణన్ మొక్కల పెంపకంలో గ్రుడ్ల వాడకం చేపట్టారు. ఆయన 3-5 గ్రుడ్లను పంచగవ్య అనే ద్రావణంతో కలిపారు. ఈ రెండింటికి సమ్మేళనం మొక్కల పెరుగుదలపై ప్రభావం చూపింది. ఈ ద్రావకాన్ని వడకట్టడం



కష్టమైన పని. దీనికిగాను ఆయన సులభ మార్గాన్ని కనుగొన్నాడు. ఒక గోనెసంచిలో ద్రావకాన్ని రాత్రి నింపి చెట్టుకు వ్రేడతీయడం, దానికింద ఒక పాత్ర వుంచడం, తెల్లారేసరికి ద్రావకం ఒడకట్టబడుతుంది. దీనికి 1–3 శాతం నీటితో కలిపి మొక్కలపై వెదజల్లడం.

## పచ్చిగడ్డివల్ల అజీర్తి అయితే ?

పశువులు తరచుగా కొత్త / పచ్చి ధాన్యపు గడ్డిని మేసినపుడు అజీర్తితో బాధదుతుంటాయి. అలాంటప్పుడు ఆహారం సరిగా తీసుకోలేవు. ఈ అజీర్తి నివారించడానికి సరోజ్‌కుమార్ బిస్వాల్ గారు 100 గ్రా. వంటసోడా, 50 గ్రా. అల్లంపొడి, 50 గ్రా. ఉప్పు



తీసుకుని గోరువెచ్చటి నీరిలో కలిపి పశువులచేత త్రాగిస్తారు. అలా ఒక వారం రోజులు ఇస్తే వ్యాధి మటుమాయం అవుతుంది.

## పశువులలో గొంతువాపు, ముక్కు కారడం బేగా వ్యాధుల నివారణకు

ఒరిస్సాలోని అంతర్యామి ప్రధాన్ గారు సాంప్రదాయ రీతిలో పశువులకు వైద్యం చేస్తారు. గొంతువాపు, ముక్కు కారడం, బేగా



మొదలగు వ్యాధుల నివారణకు ఆయన మూలికా వైద్యం ఎంచుకున్నారు. వీటి నివారణకు ఆయన 50 గ్రా. పచ్చి మిరప, 50 గ్రా. ఆవాలు, 100 గ్రా. అరటి కాండము, 50 గ్రా. లేత అరటి ఆకులను తీసుకునిన వీటిని బాగా దంచి మిశ్రమం చేసి, రెండు చెంచాల నెయ్యి కలుపుతాడు. ఈ మిశ్రమాన్ని వ్యాధి సోకిన పశువులచేత త్రాగిస్తాడు. ఈ లేపనాన్ని గొంతుక్రింద కూడా రాస్తారు. నాలుగవ రోజు నుండి పశువు ఆరోగ్యవంతంగా తయారవుతుంది. ఆహారం తీసుకుంటాయి. ఇప్పటిదాకా అతను చాలా పశువులకు ఇలాంటి వైద్యం అందించి మంచి ఫలితాలను సాధించారు. ●

# పల్లె సృజన

**పాఠకులకు ఒక మనవి**

**మన రాష్ట్రంలోని దాదాపు ప్రతి గ్రామంలోను మనుష్యులకు వచ్చే చిన్న చిన్న రోగాలు, పశులకు వచ్చే రోగాలకు ఆయా గ్రామాల వాతావరణాన్ని బట్టి తాము చేసే చిన్న చిన్న చిట్కా వైద్యాలు చేసేవారు తప్పకుండా వుండివుంటారు.**

**వారిని వెలికి తీయడం ఓ బాధ్యతగా స్వీకరించి వారు చేసే చిట్కా వైద్యాలను మాకు తెలియజేస్తే 'పల్లెసృజన'లో ప్రచురించటంతో పాటు 6వ ద్వైవార్షిక పోటీలకు పంపే అవకాశం కూడా ఉంది. అలా ప్రచురించటం వల్ల ఆయా రోగాలకు ఉపయోగపడే మందును ప్రతి ఒక్కరు తమ అవసరాలకు వినియోగించుకునే వీలు కలుగుతుంది.**

**మీకు తెలిసిన చిట్కా వైద్యాలను వెంటనే మాకు వ్రాయండి.**

**మీరు పంపేందుకు కావలసిన నమూనా దరఖాస్తులు 26, 27 పేజీలలో కలవు.**

**మా చిరునామా :**

**శ్రీమతి అరుణ గణేశం**

అసోసియేట్ ఎడిటర్, పల్లెసృజన,

102, వాయుపురి, సైనికపురి పోస్టు, సికింద్రాబాద్ – 500 094.

**ఫోన్ : 98660 01678**

## వెంకట కృష్ణ మరో సృజనాత్మక సృష్టి

# సంహారిణి



కర్నూలు జిల్లా వెలుగోడు మండలం బోయరేవుల గ్రామానికి చెందిన వెంకట కృష్ణుడు 'పల్లెసృజన' పాఠకులకు విదితమే. గత సంచికలో ఇతను కనుగొన్న సంజీవిని గురించి చదివారు. తన సృజనాత్మకతను అక్కడితో ఆపక మరో అద్భుతమైన హెర్బల్ దివ్య ఔషధాన్ని కనుగొన్నాడు. వివిధ రకాల పంటలకు పట్టే పురుగు, దోమపోటుల నుండి కాపాడటానికి ప్రకృతి సహజసిద్ధమైన ఫార్ములాతో తయారు చేయబడిన ఈ ఔషధం వృక్ష సంబంధిత భాగాలతో మాత్రమే చేయబడింది. ప్రకృతిలోని వృక్ష సంపదను వినియోగించుకుని సాంప్రదాయ విజ్ఞానంతో స్వయంగా తయారు చేశాడు. ఇందులో ఏమాత్రం రసాయనాల వినియోగం లేకుండా సమర్థవంతంగా సమర్థవంతంగా పైర్లకు పట్టిన చీడ పీడలనుండి కాపాడుకోవచ్చని నిరూపించాడు.

జంతువులేవీ ముట్టని ఏ మొక్కయినా సస్యరక్షణకు చక్కగా పనికొస్తుందని పూర్వీకులు ఏనాడో పేర్కొన్నారు. ఈ ప్రేరణతోనే 'సంహారిణి' అనే ఔషధాన్ని తయారు చేయటానికి పూనుకున్నాడు. విచక్షణా రహితంగా రసాయణ మందులను వాడటం వలన పురుగులు విషప్రభావానికి తట్టుకునే సామర్థ్యాన్ని పెంచుకొని విపరీతంగా పంటలను నాశనం చేస్తున్నాయి. రైతుమిత్ర పురుగులైన బదనికలు, సాలీడులు, అక్షింతల పురుగులు, కందిరీగలు చనిపోతున్నాయి. ఫలితంగా శత్రుపురుగుల సంఖ్య పెరిగిపోయి పంటంతా శత్రుపురుగుల వశమైన నాశనమవుతున్నది. పర్యావరణానికి, పశు పక్ష్యాదులకు, జల చర జీవ రాశులకు హాని జరుగుతున్నది.

కావున వృక్ష సంబంధిత పురుగు మందులను వాడటం వలన రైతుమిత్ర పురుగులకు హాని ఏమాత్రం జరగక వాటి అభివృద్ధి వల్ల పంటలకు మేలు జరిగే అవకాశం ఎక్కువగా వుంది. వీటి అభివృద్ధి వల్ల సహజంగానే శత్రుపురుగుల ఉధృతి తగ్గి పంట దిగుబడి పెరిగే అవకాశాలు ఎక్కువ. 'సంహారిణి' వాడటం వల్ల పచ్చ పురుగు, లద్దెపురుగు, నార పురుగులను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు. దాదాపు 20 రోజుల వరకు మందు ప్రభావం పంటపై వుంటుందని కృష్ణ తెలియజేస్తున్నారు.

వెంకట కృష్ణుడు కనిపెట్టిన ఈ 'సంహారిణి' మందును 'మ్యాట్రిక్స్' సంస్థ వారు పెద్దయెత్తున తయారు చేసి మార్కెటింగ్ చేయడానికి పూనుకున్నారు. అతి స్వల్ప కాలంలో వెంకట కృష్ణ ద్వారా మరో పురుగు మందు తయారు చేయబడటం ఎంతో ఆనందంగా వుందని మ్యాట్రిక్స్ యండి శ్రీశివ ప్రసాద్ గారు తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సంస్థ ద్వారా మార్కెటింగ్ చేయబడే ఇలాంటి మందులను విక్రయించడం వల్ల వచ్చే లాభాల్లో కూడా ఈ గ్రామీణ శాస్త్రవేత్తలకు కొంత భాగాన్ని కేటాయిస్తామని ఆయన తెలియజేశారు.

తమకు తెలిసినా వెలుగులోకి రాని ఇంకా ఎందరో గ్రామీణ శాస్త్రవేత్తలు మన రాష్ట్రంలో ఉన్నారని, వారు తమ తమ ఉత్పత్తులను 'పల్లెసృజన' ద్వారా వెలుగులోకి తీసుకువస్తే ఆయా వ్యక్తులు లాభ పడటంతో పాటు రైతాంగానికి, పర్యావరణానికి కూడా ఎంతో మేలు చేసినవారవుతారని ప్రసాద్ గారు తెలియజేశారు. సాంప్రదాయ జ్ఞానాన్ని వెలుగులోకి తీసుకు రావడానికి హనీబీఏపి, పల్లెసృజనలు నిర్వహిస్తున్న పాత్ర అద్వితీయమని ఆయన అభివర్ణించారు.




పల్లె సృజన

వెలుగు చూడని
పల్లె శాస్త్రవేత్తల వేదిక.

చదవండి
చదివించండి
చందాదారు కండి

సంవత్సర చందా రూ. 100/-లు మాత్రమే



# ఏకలవ్యుడు రాంబాబుకు అరుదైన సన్మానం

– శ్రీ పార్థసారథి, సింగరేణి కాలరీస్, కొత్తగూడెం.

**'మట్టిలో మాణిక్యం ఏకలవ్యుడు రాంబాబు' శీర్షికను గత సంచికలో ప్రచురించిన విషయం పాఠకులకు విదితమే. మూడవ తరగతి వరకు మాత్రమే చదువుకున్న ఈ అడవిబిడ్డ సృష్టించిన సెల్‌ఫోన్‌తో పంప్‌సెట్‌ను ఆపరేట్ చేసే పద్ధతిని కనుగొన్న విషయాన్ని తెలుసుకున్న కొత్తగూడెం లోని కృష్ణవేణి జూనియర్ కళాశాల విద్యార్థులు సన్మానించారు.**

24 సంవత్సరాల వయసుగల శ్రీ తేజావత్ రాంబాబుది కొత్తగూడెంకు 12 కి.మీ. దూరంలో గల టేకులపల్లి మండలం లోని 'బొమ్మనపల్లి' (బిల్లుడితండా) గ్రామం. ఇతని ప్రతిభను హనీబీఏపి ద్వారా విన్న కొత్తగూడెం లోని కృష్ణవేణి జూనియర్‌కళాశాల యాజమాన్యం మరియు కళాశాలలోని విద్యార్థులు కలిసి సగర్వంగా సన్మానించారు.

మూడవ తరగతి మాత్రమే చదివి, తన అపార జ్ఞానంతో 'సెల్‌ఫోన్ సహాయంతో కరెంట్ మోటార్లను ఆన్, ఆఫ్ చేసే సాధనాన్ని కనిపెట్టిన రాంబాబుకు ఒక కళాశాల విద్యార్థుల సన్మానం మాటలకందని ఆనందానికి గురిచేసింది. చదువు





లేని తనకు ఉన్నత చదువులు చదువుకున్న అధ్యాపకులు తనను సన్మానించడమంటే ఆ ఆనందం మాటలలో వర్ణించడం కష్టమే కదా!

ఇలాంటి సన్మానాలు ఎందరో పల్లె ప్రజలలో దాగివున్న జ్ఞానాన్ని బయటకు తీయటానికి ఎంతగానో ఉపకరిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. రాంబాబు తయారు చేసిన పరికరాన్ని హైదరాబాద్ నగరంలోను, మహబూబ్‌నగర్ జిల్లాలోని అయిజ మండలం ఉత్తనూరు గ్రామంలో జరిగిన వ్యవసాయ ప్రదర్శనలలో ప్రదర్శించడం, అక్కడి రైతులు ఎంతో ఆనందంగా ఈ పరికరాన్ని వివరాలు తెలుసుకోవడమే కాకుండా ఈ పరికరాన్ని తయారు చేసివ్వమని చెప్పడం కూడా జరిగింది. ఎన్.ఐ.ఎఫ్. వారు రాంబాబుకు ఈ ప్రదర్శనలకు గాను దారి ఖర్చులతో పాటు రూ. 6,000/–ల నగదును కూడా ఇచ్చి ఈ పరికరాలను తయారు చేసి విక్రయించుకునేందుకు ఏర్పాట్లు కూడా చేసింది.

కృష్ణవేణి జూనియర్ కళాశాల యాజమాన్యం, విద్యార్థుల సమక్షంలో సన్మాన సభ నిర్వహించింది. కృష్ణవేణి సంస్థల డైరెక్టర్ శ్రీ ఎమ్. కోటేశ్వర్ రావు గారి ఆధ్వర్యంలో సన్మాన సభ ఏర్పాటు చేయబడింది. ప్రిన్సిపాల్ శ్రీ వై. వెంకటేశ్వర రావుగారు శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కళాశాల సీనియర్ సలహాదారుడు శ్రీ కె.ఎమ్. చటర్జీ కార్యక్రమాన్ని చక్కటి చతురోక్తులతో విద్యార్థులను ఉత్తేజ పరుస్తూ సభను నిర్వహించారు. సింగరేణి కాలరీస్ సూరింటెండింగ్ ఇంజనీర్ శ్రీ పి. పార్థసారథి గారు రాంబాబును సభకు పరిచయం చేశారు. సింగరేణి కాలరీస్ డిప్యుటీ జనరల్ మేనేజర్ శ్రీ పి. కుమార్ శోధన, ప్రాముఖ్యం వివరాలను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం రాంబాబు తన సెల్‌ఫోన్‌తో కళాశాల పంప్‌సెట్‌ను ఆన్, ఆఫ్ చేసి చూపించాడు. విద్యార్థులు ఆనందంతో, ఉత్సాహంతో తిలకించారు. ప్రిన్సిపాల్ విద్యార్థులను రాంబాబు మార్గంలో నడవాలని ప్రోత్సహించారు. సింగరేణి కాలరీస్ మానవ వనరుల విభాగం చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీ పి. చంద్రకాంత్ శర్మ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాంబాబు ప్రతిభను గుర్తించి, పదిమందికి తెలియజేసిన టి.వి.–9 విలేకరి శ్రీ తలారి రవికుమార్‌ను కూడా సన్మానించడం జరిగింది.

ఈ సన్మానానికి రాంబాబు సమాధానమిస్తూ "కనీస చదువు కూడా లేని తనను ఒక కళాశాల విద్యార్థులు సన్మానించడం. ఇది నేను కలలో కూడా ఊహించలేదని, ఈ ఆనందాన్ని మాటలలో వర్ణించలేన"ని అన్నారు. నాకు ఇంతటి గుర్తింపు తెచ్చిన హనీబీ కో–ఆర్డినేటర్ శ్రీ గణేశం గారికి, శ్రీ చంద్రకాంత్ శర్మ గారికి తన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సన్మానం నా జీవితంలో మరిచిపోలేని సంఘటనగా వుంటుందని అన్నారు.

ఇప్పుడు రాంబాబు కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్‌లో షాపు పెట్టుకున్నాడు. ఈ సన్మానం ద్వారా తనకు కొత్తగూడెంలో పరిచయాలు పెరిగాయని, దీంతో తన ఆలోచనలకు, ఆవిష్కరణలకు మార్కెట్ పెరిగిందని గర్వంగా చెప్పాడు. రాంబాబు యొక్క ఈ ప్రయత్నం విజయవంతం కావాలని, ఆయన సృజనాత్మక శక్తికి తెలుగు ప్రజలు సరియైన ఆర్థిక విలువ కల్పిస్తారని ఆశిస్తున్నాము. ●



## స్వయం ఉపాధికై స్వీయ అన్వేషణ

# అనుకూల వాహనంతో వ్యాపారం ముమ్మరం

**ఒక అవసరం మనిషి ఆలోచనను రెట్టింపు చేస్తుంది అనటానికి మరో ఉదాహరణ ఈ వాహనం. నెల్లూరు జిల్లా కావలి పట్టణం రామ్మూర్తినగర్‌కు చెందిన పట్టెం చంద్ర పదవ తరగతి వరకు, అతని సోదరుడు మాధవ ఐ.టి.ఐ. వరకు చదివారు. వీరి తండ్రి బ్రహ్మయ్య తోపుడు బండిపై ప్లాస్టిక్, స్టీలు వస్తువులు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించేవారు. ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉండటంతో వీరిద్దరు కూడా అదే పని చేయాల్సి వచ్చింది.**

చెరో బండిపై ఉదయం నుంచి రాత్రి వరకు పట్టణమంతా తిరిగి వ్యాపారం చేసినా, కూలి డబ్బు కూడా వచ్చేది కాదు. తోపుడు బండివల్ల ఎంతో సమయం వృధా అవుతోందని గ్రహించారు. తోపుడు బండిపై వ్యాపారం చేయాలంటే రోజంతా నడవాలి, గంటల సమయం వృధా అవుతోంది. అదే మోటారు వాహనమైతే ఎంచక్కా వేగంగా సాగిపోవచ్చు, సమయం ఆదా ఎవుతుంది. ఎక్కువ వీధుల్లో వ్యాపారం చేసుకోవచ్చునని, తద్వారా ఆదాయం కూడా పెరుగుతుందని ఆలోచించారు. వారికున్న ఆలోచన మేరకు తమ బండికి స్కూటర్ ఇంజన్, స్టీరింగ్ ఉంటే బాగుంటుందని ఆలోచనే వారిని ప్రగతిపథం వైపు నడిపింది.

రెండు నెలలు కష్టపడి తమ వ్యాపారానికి అనుకూలంగా ఉండేలా మోటారు వాహనాన్ని తయారు చేశారు. తమది ప్లాస్టిక్ సామాన్ల అమ్మే వ్యాపారం కాబట్టి ఎక్కువ సామాన్లు ఆ వాహనంలో నిలువ వుంచాలి. అందుకు వీలైనంత విశాలమైన స్థలం కావాలి. అని వారి అవసరానికి తగినంత విశాలంగా వాహన బాడీని నిర్మించుకున్నారు. దానికి అవసరమైన చక్రాలు రూపొందించారు. ఆ వాహనానికి స్కూటర్ ఇంజన్‌ను బిగించి, దానికి అవసరమైన హ్యాండిల్‌ను వినియోగించారు.



ఈ వాహనం లీటరు పెట్రోలు 20 కి.మీ. వస్తుంది. ఒకరోజులో మట్టణమంతా తిరగొచ్చు. ఈ వాహనం తయారీకి రూ. 20 వేలు ఖర్చయిందని వారు చెప్పారు. ప్రస్తుతం రోజూ రూ. 300 వరకు సంపాదిస్తున్నామన్నారు. ఉదయం 8 గం.ల నుండి మధ్యాహ్నం 2 గం.ల వరకు ఒకరు, అప్పటినుండి రాత్రి 8 గం.ల వరకు మరొకరు ఇలా ఈ వాహనంపై వ్యాపారం చేస్తున్నారు. శ్రమ తగ్గింది, ఆదాయం పెరిగిందని ఎంతో సంతోషంగా తెలియజేశారు. తమకు సహకరిస్తే చిరు వ్యాపారులకు ఉపయోగపడేలా ఇలాంటి వాహనాలు తయారు చేస్తామని చెబుతున్నారు.

పట్టెం చంద్ర సోదరులకు వారి అవసరం ఈ ఆలోచనకు రూపునిచ్చి ఒక మంచి వాహనం తయారు చేసుకోవడమే కాక, వారి వ్యాపార అభివృద్ధికి కూడా తోడ్పడింది. హనీబీఏపి ఈ ఇన్నోవేషన్‌ను ద్వైవార్షిక పోటీలకు పంపనున్నది.



# కాశ్మీరు శోధయాత్ర

### 2వ భాగము

**15 సంవత్సరాలుగా ఎటువంటి వేడుకలు లేని పాఠశాలలు :**

ఈ శోధయాత్రలో మేము సాదివార, వీరనాగ్, నాగం, బాటాగుండ్, బ్రాగాం, క్రేరి, లిస్సార్ మొదలగు గ్రామాల్లో పర్యటించాము. అక్కడి విద్యార్థులతో అనేక విషయాలు మాట్లాడాము. అక్కడ మాకు ఒక బాధాకరమైన విషయం తెలిసింది. గత 15 సంవత్సరాలుగా ఏ పాఠశాలలో కూడా ఎటువంటి వేడుకలు జరుగలేదు. అంటే దాదాపు ఒక తరం వారు దీనికి నోచుకోలేదు. సంతోషంగా, ఆనందంగా అందరూ కలిసి మెలిసి వారి ప్రతిభా పాటవాలను చూపెట్టడం జరుగలేదు. కనీసం పాఠశాలల ప్రారంభోత్సవాలకైనా బయటినుండి ఎవరూ వచ్చినట్లు లేదు. మా సందర్శనం వారికి పెద్ద విందులాగా కనిపించింది. క్రేరి గ్రామంలో మా బస చాలా బాగా జరిగింది. మాకు స్వాగతం పలకడానికి 3 పాఠశాలల నుండి విద్యార్థులు వచ్చారు. కళా ప్రదర్శనతో పాటు చిన్న చిన్న పోటీలు కూడా నిర్వహించారు. 'ఆప్రికాట్'తో చేసిన పచ్చడి చాలా కొత్తగా ఉంది. దీని గురించి ఇంతకుముందు వినలేదు. దీనిలో పోషక విలువలు ఎక్కువగా ఉన్నవి.

**మా పాదయాత్రలో చిన్నారులు:**

ఇద్దరు విద్యార్థులు వెనువెంటనే మాతో పాదయాత్రకు బయలుదేరారు. అందులో ఒకరు 10వ తరగతి చెందిన అహ్మద్ హుసేన్ జాన్. అది మేము క్వాజిగుండ్ నుండి మొదలు పెట్టినరోజు. అతనికి తండ్రిలేదు. ఒక చెల్లెలు వుంది. అన్న శ్రీనగర్‌లో మొదటి సంవత్సరం కళాశాలలో చదువుతున్నాడు. ఇతడు ఐ.టి.ఐ.లో ఎలక్ట్రికల్ ఫిట్టింగ్స్ చేసి స్వంతంగా ఒక దుకాణం తెరవాలని అనుకుంటున్నాడు. ఈ పని అతను తన మేనమామ నుండి నేర్చుకుంటున్నాడు. అతను తన పాఠశాల అధ్యాపకునికి శెలవు చీటీ ఇచ్చి మాతో యాత్రలో చేరడానికి వచ్చాడు. మరి పాఠశాలలో చెప్పే విద్యా విషయాలు పోతవి కదా అంటే తమ ఉపాధ్యాయుడు ఆరోజు చెప్పే పాఠము తను ఇంతకుముందే నేర్చుకున్నానని చెప్పాడు.



దొరు గ్రామం నుండి ఆకిబ్ జావేద్ మాతో కలిశాడు. అతని తండ్రి అటవీశాఖలో రేంజర్‌గా పని చేశారు. జావేద్‌కు మూలికా పరిజ్ఞానం వుంది. అది అతను తన అమ్మమ్మ నుండి నేర్చుకున్నాడు. అతడు ఆమె చేసే పలు మూలికా సమ్మేళనాలను గమనించేవాడు. అతడు మాకు 'గుల్‌కంద్' ను చవి చూపించాడు. ఇది గులాబి రేకులు, పంచదార కలిపి చాన్ని నెలలు పులియబెట్టబడింది. వడకట్టిన దానిని వేడినీటితో సేవిస్తే గొంతు వ్యాధులు నయమవుతాయని, ఆరోగ్యానికి కూడా మంచిదని అన్నాడు. అతడు మాకు చురానా అనే చూర్ణం చూపించాడు. ఇది ఉదయ సంబంధ వ్యాధులపై బాగా పనిచేసుతంది. అతడు వృక్ష శాస్త్రంలో పి.హెచ్‌డి. చేసి సమాజానికి ఏదైనా మేలు చేయాలని అనుకుంటున్నాడు. కొకెర్‌నాగ్ నుండి సయ్యద్ ఇంతకాబ్, సైఫ్ జాన్ వాని అనే వారు మాతో కలిశారు. వారు మాకు ఇంతకుముందు




Sun temple at Mattan

వెళ్ళేటప్పుడు అక్కడ కొందరు పెద్దమనుషులను రహదారిపైనే సన్మానించాము. మేము గ్రామంలోకి అడుగు పెట్టేముందు ఒక అందమైన ఇంటిని చూశాము. ఆ ఇంటిలో మరికొన్ని వివరాల కోసం వెళ్ళాము. ఆ ఇల్లు ఒక నేత కార్మికుడిది. అతను ఇంటిని కాల్చని ఇటుకలతో కట్టాడు. దానికి పైమెరుగులు, నార, పింగాణి మట్టితో చేసినాడు. అందులో సిమెంటు వాడకం లేదు. 30 సంవత్సరాల క్రితం నిర్మించిన ఇల్లు ఇప్పటికీ కొత్తగానే వున్నది. ఆ ఇల్లు వేసవిలో చల్లగాను, చలికాలంలో వెచ్చగాను వుంటుంది. ఇది భూకంపాలను కూడా తట్టుకుంటుంది. ఈ నిర్మాణం చూసిన తరువాత ప్రజలలో ఒక అభిప్రాయం ఏర్పడింది. కాల్చిన ఇటుకలు, సిమెంటు వాడిన భవన నిర్మాణం వల్ల తరచుగా ప్రజలకు వెన్ను నొప్పులు వస్తున్నాయని.

దీతురీనిపోరా వైపు నడుస్తున్నపుడు మేము ఒకే వరుసలో వృక్ష సముదాయాన్ని చూశాము. ఇవి అతి దగ్గరగా వున్నవి. తరువాత మాకు తెలిసిన విషయం ఏమిటంటే అది ఒక పండిట్ ఇల్లు. ఇవి ప్రకృతిపరంగా ధ్వని, వాయు తరంగాలను నివారించగలవని విశ్వాసం. సోయాఫ్ నలి గ్రామంలో మేము ఒక వికలాంగుడిని కలిశాము. ఫిర్దూస్ అహమ్మద్ మత్‌కూ అనే అతను బంకమన్నుతో బొమ్మలు

కూడా సహకరించారు.

**ఏదో ఒక రోజు తిరిగి వస్తారు :**

మా కొకెర్‌నాగ్ పాదయాత్రలో ముగ్గురు మాతో కలిశారు. వారు మా గురించి వివరంగా తెలుసుకున్నారు. వారిలో ఒకరు పోలీసు శాఖలో పనిచేశారు. మిగిలిన ఇద్దరు విద్యార్థులు మాకు వాళ్ళు అక్కడి 'పండితులు' (కాశ్మీరు బ్రాహ్మణులు) పెంచి పోషించిన తోటల గురించి వివరించారు. ప్రస్తుతం వారి ఇళ్ళు, ఆలయాలు అన్నీ శిథిలావస్థలో వున్నవి. ఇంతకుముందు ఇరువర్గాల వారు కలిసి మెలసి సంతోషంగా వుండేవారు. వివాహ కార్యక్రమాలకు వెళ్ళేవారు. ఇప్పుడు వారు వలస వెళ్ళి ఎప్పుడు తిరిగి వస్తారో తెలియని స్థితిలో వున్నారు. అది కాలమే నిర్ణయించాలి.

మేము 'కటిష్టాశ్రమం'వైపు నుండి వెళ్ళేటప్పుడు అక్కడి స్థానికులు మాకు 'పండిట్స్'ల గృహ శిథిలాలను చూపించారు. పండిట్స్ అక్కడ నివసించేటప్పుడు అక్కడ వున్న పవిత్రమైన చెరువులో ఎవరినీ స్నానం చేయనిచ్చేవారు కాదట. పవిత్ర జలాలను కాపాడటానికి వారు అలా చేసేవారు. ఇప్పుడు ఆ విలువలు నశించిపోయాయి.

ఒకే తానులో నేయబడినట్లుగా వున్న ఇరువర్గాలు విడిపోవడం చాలా బాధాకరం. సహజీవనం సాగించిన కాశ్మీరులో ఆనందంగా గడిపినారు. ఈ ఎడబాటు ఎవరికి స్వాంతన చేకూర్చలేదు. ప్రజల ఆలోచనా విధానంలో మార్పు వస్తేనే పరిష్కారం. ఈ విభజన చేసినవారు సమాజానికి జరిగిన నష్టం గురించి తెలుసుకోలేరు. శోధయాత్రీకులకు ఏదోనాటికి అందరూ కలసి వుంటారని విశ్వాసం వుంది.

మేము షాంగుస్ గ్రామంవైపు




The mud house of Mohd. Yousuf Khan we saw on our way to Shangus



తాళం వేసివున్న నాటి కాశ్మీరీ పండిట్లు నివసించిన గృహాలు

తయారుచేస్తున్నాడు. అవి చూడడానికి లోహంతో చేసినవిగా కనిపిస్తాయి. దాని నగిషీలు చూసిన తరువాత అది హస్తకళలతో చేసిందంటే నమ్మశక్యం కాదు. మేము అక్కడ సూర్య దేవాలయం చూశాము. మమ్మల్ని చూడటానికి ఒక మధ్య వయస్కుడైన ముస్లిం పరిగెత్తుకుంటూ వచ్చాడు. అతడు మమ్మల్ని తిరిగి వచ్చిన పండిట్స్‌గా భావించాడు. అతను రాగానే మీ అందరికి 'రాం రాం' అని చెప్పాడు. అతని ఆప్యాయతకు శోధయాత్రికులు అమితానందం పొందారు. ఇక్కడి సూర్య దేవాలయాన్ని 'పాండవుల' గుడి అని కూడా అంటారు. ఇది 6-7 శతాబ్దాలలో నిర్మించబడినది. అక్కడ ప్రార్థనా మందిరాలు, గంగా, యమున, సరస్వతి విగ్రహాలు ఉన్నవి.

అనంతనాగ్‌లో బాలుర డిగ్రీ కళాశాలలో యాత్ర ముగింపు కార్యక్రమం జరిగింది. మేము మా యాత్ర, దాని ఉద్దేశ్యం చెప్పినప్పుడు ఒక విద్యార్థి మమ్మల్ని 'మీరు కాశ్మీరులో ముందుగా ఎప్పుడు వచ్చారు?" అని. మేము 2005 అనగానే అతని ముఖం చిన్నబోయింది. మీరు ఎందుకు ఇంత ఆలస్యం చేశారు అనే భావన వెలువడింది. ఇంకొక విద్యార్థి మనం ఈ 47 సంవత్సరాలు ఎక్కడ ఉన్నారని అడిగాడు. అప్పుడు మాక్కూడా అనిపించింది మేము కూడా ఆలస్యం చేశామని. ఇది మా ఆలోచనా విధానాన్నే మార్చివేసింది. ●

## కొదురుపాక వెంకటేశ్వర్ల సృజన : స్పీడ్ బ్రేకర్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి

వరంగల్ జిల్లా, చెన్నారావుపేట మండలం, ఎల్లాయ్‌గూడేనికి చెందిన కొదురుపాక వెంకటేశ్వర్లు చదివింది ఐదో తరగతి వరకే. అయితేనేం ఆలోచన మాత్రం ఇంజనీరింగ్ చదివినంత!

తన మదిలో మెదిలిన ఓ ఆలోచన నూతన ఆవిష్కరణకు దారి తీసింది. కులవృత్తయిన బిందెల తయారీపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న వెంకటేశ్వర్లు నరికొత్త విద్యుదుత్పత్తి ప్రక్రియను రూపొందించాడు. జలవిద్యుత్తు, బొగ్గు ఆధారిత విద్యుత్తు, గాలిమరల, సముద్రపు అల విద్యుత్తు వంటివి విన్నాం. కానీ, రోడ్లపై నడిచే వాహనాలతో స్పీడ్ బ్రేకర్ల వద్ద విద్యుత్తును ఉత్పత్తి చేసే యంత్రాన్ని రూపొందించాడు. అతి తక్కువ ఖర్చుతో ఈ పద్ధతిలో విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చునని చెబుతున్నాడు.



ఇనుప పట్టీలతో దీర్ఘ చతురస్రాకారంలో చేసిన ఒక డబ్బా సవ్య, అపసవ్య దిశలో తిరిగేందుకు వీలుగా వుంటుంది. దీనికి రెండు వైపులా రెండు చక్రాలను అమర్చారు. ఈ చక్రాలను తిప్పడానికి డబ్బా ఆకారంపై ఓ స్టాండు లాంటిది ఏర్పాటు చేశారు. ఈ పరికరాన్ని భూమిలో కొంత పైకి కనిపించేలా అమర్చుతారు. వేగంగా వచ్చిన వాహనాలు ఈ పరికరంపై తీవ్ర వత్తిడిని ప్రయోగిస్తాయి. ఆ సందర్భంలో వెంటనే వైబ్రేషన్ రాడ్స్‌కు తగిలి చక్రాలు తిరగడం ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. ఈ విధానంతో పూర్తి స్థాయిలో కరెంట్ ఉత్పత్తి జరుగుతుందని వెంకటేశ్వర్లు అంటున్నారు.

ఓ స్పీడ్ బ్రేకర్ వద్ద తనకు ఎదురైన అనుభవం వల్లే ఈ పరికరాన్ని రూపొందించానని చెబుతున్న వెంకటేశ్వర్లు దీని తయారీకి అయిదు వేల వరకు ఖర్చయిందని తెలిపారు. ప్రస్తుతం దీని ద్వారా ఇంట్లోనే ఆయన 65 ఓల్టుల కరెంటును ఉత్పత్తి చేస్తున్నాడు. దేశమంతా అల్లుకొని ఉన్న రహదారులపై నిర్మించిన స్పీడ్ బ్రేకర్ల వద్ద ఈ తరహా పరికరాలను అమర్చినట్లయితే రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు, విద్యుత్తును కూడా పెద్దయెత్తున ఉత్పత్తి చేయవచ్చునని అంటున్నారు. తన చిన్ని ఆలోచనను మరింత పకడ్బందీగా తీర్చి దిద్ది, ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని అంటున్నారు. హనీబీఏపి ఈ ఆవిష్కరణను పరీక్షిస్తున్నది. ●

# నరసింహాచారి ట్యూబ్ లైట్లకు నిజామాబాద్ డిపిఓ సహకారం



'పల్లెసృజన' ద్వారా వెలుగులోకి వచ్చిన మరో ఇన్నోవేటర్ నరసింహాచారి గారి సృజన, కాలిపోయిన ట్యూబ్‌లైట్‌ను వెలిగించడం గురించి పాఠకులకు విదితమే. తన ఇన్నోవేషన్‌కు ఇప్పటికే నిజామాబాద్ మున్సిపాలిటీ గుర్తించి వీరికి గుర్తింపుతో పాటు తమ మున్సిపల్ పరిధిలోని ట్యూబ్ లైట్లను నరసింహాచారి టెక్నిక్ ద్వారా వెలిగిస్తున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న జిల్లా పంచాయతీ ఆఫీసర్ (డిపిఓ) నిజామాబాద్ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు ఈ టెక్నిక్‌ను వినియోగించుకుని ట్యూబ్ లైట్లను కొనటానికి వినియోగించే డబ్బు ఆదా చేసుకోవాలని ఆర్డర్ చేయడం జరిగింది. ఇకనుండి ప్రతి గ్రామ పంచాయతీ కాలిపో యిన ట్యూబ్ లైట్లను పారవేయ కుండా వాటిని భద్రంగా దాచి వుంచాలని, నరసింహాచారి కనిపెట్టిన చిప్‌లను కొనుగోలు చేసి కాలిపోయిన ట్యూబ్‌లైట్లను వెలిగించడం ద్వారా తమ డబ్బును ఆదా చేసుకోవాలని సూచించడం జరిగింది.



జిల్లా పరిధి లోని పంచాయతీ లకు గాను 50 వేల పరికరాలను తయారు చేసేందుకు నర్సింహాచారికి ఆర్డర్ ఇవ్వటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఈ పరికరాలను పెద్దయెత్తున తయారు చేయటానికై ఒక పారిశ్రామిక వేత్తతో ఒప్పందానికై హనీబీఏపి కృషి చేస్తోంది. ఈ ఒప్పందం త్వరలోనే కుదురుతుందని హనీబీఏపి కో-ఆర్డినేటర్ బ్రిగేడియర్ గణేశం ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర అన్ని జిల్లాల పంచాయతీ అధికారులు కూడా నరసింహాచారి పరికరాన్ని ఉపయోగించి పంచాయతీల బడ్జెట్‌లో మిగులుకు ప్రయత్నించాలని కోరుతున్నారు.


## పల్లె సృజన

**పాత ప్రతులు కావాలంటే**

**రూ. 100/-లు మనీయార్డరు లేదా డి.డి. ద్వారా పంపి**

**4 ప్రతులను పొందండి.**

సంప్రదించవలసిన చిరునామా :

**శ్రీమతి అరుణ గణేశం**

అసోసియేట్ ఎడిటర్, పల్లెసృజన,

102, వాయుపురి, సైనికపురి పోస్టు, సికింద్రాబాద్ – 500 094.

**ఫోన్ : 98660 01678**



# అరకు లోయలో శోధయాత్ర సన్నాహాలు

*– ఉప్పుతేళ్ళ కృష్ణ, అనంతవరం, ప్రకాశం జిల్లా.*

ఆంధ్రప్రదేశ్ లోని 'అరకు లోయ' ప్రాంతాన్ని 'పేదోడి ఊటి' అని కూడా చాలామంది అంటుంటారు. ఈ మాటలు అక్షర సత్యాలని నాకు ఈమధ్యనే అర్థమైంది. హనీబీ నెట్‌వర్క్, ఎన్‌ఐఎఫ్ తదితర సంస్థల ఆధ్వర్యంలో త్వరలో జరుగబోవు '21వ శోధయాత్ర' గురించిన సన్నాహాలు చేయటానికి ఆ ప్రాంతానికి వెళ్ళటం వల్ల ఈ ప్రాంతం గురించి ఎన్నోసార్లు చదివిన విషయాలను ప్రత్యక్షంగా చూడటం జరిగింది.



బ్రిగేడియర్ గణేశం గారి ఆధ్వర్యంలో నేను, కిషన్ పవార్ (సంగారెడ్డి) విశాఖ చేరుకున్నాం. డాక్టర్ వివేక్ కుమార్ అహ్మదాబాద్ నుంచి వచ్చారు. అంతా కలసి 'సమత' సహాయంతో స్థానిక స్వచ్ఛంద సేవకులు చిట్టిబాబు (టి.ఇ.ఆర్.డి.యస్.), వసంత కుమార్ (ఆదివాసి మిత్ర) ల తోడుతో ఎప్పుడూ నవ్వుతూ వుండే యువ డ్రైవర్ ప్రసాద్‌తో కలసి అరకు లోయలో శోధయాత్రకై వివరాలను సేకరించడానికి బయలుదేరాము. అరకు, పాడేరు, దొంద్రిగూడ, అనంతగిరి మండలాలలో మా ప్రయాణం సాగింది. కాలి నడకన కొన్ని మారుమూల గ్రామాలను సందర్శించడం ఒక అపూర్వ అనుభవం. కనుచూపుమేర ఎక్కడ చూసినా హరితారుణమే! ఆకుపచ్చటి దుప్పటి కప్పుకున్న గిరులు, తరులు, లోతైన లోయలు. నీలాకాశంలో మెరిసే చుక్కల్లా గిరి శిఖరాలపై మేత మేస్తూ ఆవులు, గొర్రెలు. పల్లెపడుచు శిరస్సునుండి జాలువారిన ముంగురుల్లా అక్కడక్కడ శిఖరాల నుండి దుమికే జలపాతాలు. వాటిమధ్యలో వెళ్తూ వుంటే మేము ప్రయాణించే వంపులు తిరిగిన రోడ్లు కూడా అందంగానే కనిపించాయి. కొండశిఖరాలపై శబ్దం చేస్తూ నడిచే రైళ్ళు! ప్రపంచం లోని మొత్తం అందమంతా ఇక్కడే ప్రోగు చేయబడిందా? అన్నట్లుండే ఆహ్లాదకర మైన ప్రకృతి.

అక్కడక్కడ తమకు విరివిగా లభించే కలప, మట్టి, రాళ్ళతో నిర్మించుకున్న కాలనీ లోగిళ్ళు. ఇక అక్కడి ప్రజానీకం ముఖాల్లో విచిత్రమైన కాంతులు – రింగులు తిరగిన వంకీల జుట్టు, చిన్న ముఖం, చప్పిడిముక్కు, లావాటి పెదాలు, నల్లటి నగుమోము, మూరెడు గోచి గుడ్డ



తప్పు మరే ఆచ్ఛాదనా లేని నగనిగలాడే నల్లటి శరీరంతో గల పురుషులు. పొడగాటి గుడ్డనే చీరగా చుట్టుకొని జాకెట్టు వాడటం ఇంకా తెలియని గిరిజన స్త్రీలు. ఇది అక్కడి గిరిజనుల ఆకృతి.

కల్మషం లేని చూపులు, మోసాలు చేయడమంటే తెలియని అమాయక ముఖాలు, ప్రకృతినే నమ్ముకుని అనేక వికృతులతో జీవించే ఆ గిరిజనులు సెలయేటిలోని నీటిలా స్వచ్ఛమైన వారు. అప్పుడపుడు టివిలలో, పేపర్లలో అరకు లోయ గురించి చెప్పింది, చూపింది చదవటం, చూడటం తప్ప ఇప్పుడే ప్రత్యక్షంగా చూస్తున్నాను. ఇప్పుడు ప్రత్యక్షంగా అక్కడి జీవన విధానం చూస్తున్న నాకు ఒళ్ళంతా పులకరించినది. హృదయం సంతోషంతో నిండిపోయింది. కానీ కించిత్ బాధ కూడా కలిగింది. ప్రభుత్వం వారిచ్చే 4 కిలోల రేషన్ బియ్యంకోసం, దప్పికతీర్చే బిందెడు నీటికోసం, వారానికోమారు జరుగు పచారీ వస్తువుల సంతకోసం – ఇద్దరు కూడా పక్కపక్కన నడవటానికి వీలు లేని సన్నని కాలిబాటల్లో కిలోమీటర్ల కొద్ది అలా గండుచీమల దండులా నడిచిపోతూనే వుంటారు. వారి అమాయకత్వానికి ఆనందించాలో, లేక వెనకబాటు తనానికి మనల్ని మనం నిందించుకోవాలో తెలీటం లేదు.

కొత్త మనిషి కనపడితే, పండుగలాగ సంబరాలు చేస్తూ, వేటలు, కోళ్ళు కోసి అతిథులకు మర్యాదలు జరిపే గిరిజనులు ఉన్నారంటే మనం ఆశ్చర్యపోక తప్పదు.

స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలు అవుతున్నా ఒక్క ప్రభుత్వ ఆఫీసరును కూడా చూడని ఊళ్ళు ఉన్నాయంటే మీరు నమ్మగలరా? అక్కడి లోకల్ వాలంటీర్ మాతో ఈవిషయం చెప్తూ వుంటే విని ఆశ్చర్యపోవడం మా అందరి వంతయింది.

ప్రమాదం జరిగినప్పుడు, మహిళల ఆరోగ్యం బాగా లేనప్పుడు డోలీ ప్రయాణం తప్ప, 108 అంబులెన్స్ ప్రయాణం తెలియని ఊళ్ళు లెక్కకు మించి కలవు.



అలాంటి గిరుల్లో, తరుల్లో హనీబీఎపి శోధ యాత్రకు పూనుకుంది. ఆగిన ప్రతి గ్రామంలో బయటి ప్రపంచం గూర్చి వారికి, వారిని గూర్చి బయటి ప్రపంచానికి తెలియజెప్పింది. అక్కడి విశిష్ట వ్యక్తులను సత్కరిస్తూ, గౌరవించింది. అక్కడి మూలికా వైద్యం గూర్చి రిజిష్టరు చేయించింది. అక్కడ దొరికే విజ్ఞానాన్ని గూర్చి బయటి ప్రపంచానికి తెలియజేయాలనుకుంది.

విలువైన వన సంపదా ఉంది.

సమృద్ధిగా ఖనిజ సంపదా ఉంది.

విశాలమైన బలమైన భూములూ ఉన్నాయి. లేనివారు నిరుపేదలు – కానీ అన్నీ ఉన్నా వీరూ నిరుపేదలుగానే వున్నారు. వీరిని జాగృతులను చేయటం, అక్కడి సమస్యల పట్ల అవగాహన కల్పించడం, వారికి వారుగా పరిష్కరించుకునేట్లు చేయడం ముఖ్యం. ఈ విషయంలో హనీబీఎపి శ్రీ గణేశం గారి నేతృత్వంలో మంచి ఫలితాలను సాధించాలని భావిస్తున్నాం.

పల్లెపల్లెకు కాలినడకన తిరిగి, విశిష్ట వ్యక్తులను గౌరవించడం జరిగింది. వారి సమస్యలు ఆలకించి, తగు సూచనలు చేయటం, వారివద్ద గల సాంప్రదాయ బద్ధంగా దొరుకు విజ్ఞానాన్ని రిజిష్టరు చేసి, పల్లె ప్రజల్లో కలిసి భోజనం చేసి, వారితో కలిసి కటిక నేలపై నిద్రపోవడం, గిరిజనులతో ఆట పాటల్లో పాలు పంచుకోవడం, ఆనందం పంచుకోవటం అంతా ఓ తీపి గురుతుగా మదిలో ఎప్పుడూ నిలిచి వుంటుంది.

●

# స్పందన

సంపాదకులకు నమస్కరించి వ్రాయునది,

మాది ఎల్లాయిగూడెం, చిన్నారావుపేట మండలం, వరంగల్ జిల్లా. నా ఛలోచనా విధానం ప్రకారం నా మదిలో మెదిలిన ఆలోచన రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లనే జనరేటర్లుగా ఉపయోగించి విద్యుత్తును తయారు చేసుకోవచ్చు నని. దీనికి ఇంధనం ఖర్చుగానీ, ఏ ఇతర ఖర్చుగానీ లేకుండా ఉపయోగపడుతుంది. ఇలా విద్యుత్తును తయారు చేసుకోవటంతో పాటు పర్యావరణాన్ని కూడా రక్షించుకోవచ్చు. ఈ పరికరాన్ని తయారు చేయుటకు మీరు అంగీకరించి అవకాశమిస్తే నేను తయారు చేయగలను. దీన్ని తయారు చేయుటకు దాదాపు రూ. 50 వేల వరకు ఖర్చవుతుంది. మీ అంగీకారాన్ని తెలిపినచో నేను ఈ పరికరాన్ని తయారు చేసి రవాణా విద్యుత్తుతో ముమ్ముందుకు తీసుకు పోగలరని ఆశిస్తాను.

– కె. వెంకటేశ్వర్లు.

**మీరు తయారు చేయాలనుకున్న పరికరం నమూనాతో సంప్రదిస్తే తగిన సహకారం అందించగలము.** – ఎడిటర్.

బ్రిగేడియర్ గణేశం గారికి,

జులై-సెప్టెంబర్ 2007 'పల్లెసృజన' పత్రిక చూశాను మీరు పంపిన సెల్‌ఫోన్ మెసేజ్‌ను కూడా చూశాను. నాకు చాలా సంతోషంగా ఉంది. గ్రామీణ ప్రజల్లో దాగివున్న జ్ఞానాన్ని వెలికి తీసే వివరణాత్మక వ్యాసాలతో పాటు గ్రామాల్లో దాగివున్న జ్ఞానాన్ని వెలికి తీయాలనే మీ ఆలోచనకు నా కృతజ్ఞతలు. మీరు గ్రామీణ శాస్త్రవేత్తలకు అందిస్తున్న సహకారం నాకెంతో సంతోషాన్నిచ్చింది. మీ కార్యక్రమాలు ఇంకా విజయవంతం కావాలని ఆశిస్తూ హనీబీఎపి యంత్రాగానికి నా అభినందనలు తెలియజేస్తున్నాను.

– **యం.వి. రావు,** ఎం.ఎల్.సి., అధ్యక్షులు, అగ్రి బయోటెక్ ఫౌండేషన్. సికింద్రాబాద్.

**– మీ అభిమానానికి ధన్యవాదములు మీలాంటి ఆధునిక భావాలుగల శాస్త్రజ్ఞుల మార్గదర్శకత్వం మాకుంటే ద్విగుణీకృత ఉత్సాహంతో మేమింకా ముందుకు సాగుతాం.**

– ఎడిటర్.

**మీ బంధు-మిత్రులకు**
**శ్రేయోభిలాషులకు**
**గ్రంథాలయాలకు**
**పాఠశాలలకు**
**ఓ అమూల్య బహుమతి**
**ఇవ్వాలనుకుంటున్నారా?**

**వార్షిక చందా ద్వారా**

**పల్లె సృజన**

**ఇచ్చి**
**మీ ప్రత్యేకతను**
**వ్యక్తపరచండి!**

**పాఠకులకు మనవి.**

**గ్రామాల్లోని సాంకేతిక ఆవిష్కరణలను, సాంప్రదాయ పరిజ్ఞానాన్ని శోధించే ఆరవ జాతీయ ద్వైవార్షిక పోటీలకు ఎంట్రీలు తక్కువగా ఉన్నాయి. డిశంబర్ 2008 ఆఖరు తేది సమీపిస్తున్నది. కావున వీలైనంత త్వరలో మీకు తెలిసిన గ్రామీణ జ్ఞానానికి సంబంధించిన వివరాలను తెలియజేయ గలరు. మినీ శోధయాత్రలు, స్టూడెంట్ క్లబ్బులు, గ్రామీణ ప్రదర్శనల్లో పాల్గొనడం లాంటి కార్యక్రమాల్లో మీరు చేయూతనిస్తారని, తద్వారా మన ఆశయ సాధనకు కృషి చేస్తారని ఆశిస్తున్నాము.**

**మీ స్పందనలు, ఆలోచనలు, గ్రామీణ జ్ఞాన సంపదను గురించి, వాటిని వెలికి తీసే పద్ధతులను గురించి మీ దృక్పథాలను మాకు పంపించండి. మేము యథాతథంగా ప్రచురిస్తాం. మీ అందరి సహకారం ఈ జ్ఞాన సముపార్జన యజ్ఞంలో ఉంటుందని మనసారా ఆశిస్తూ....**

**– బ్రిగేడియర్ పి. గణేశం, కో-ఆర్డినేటర్, హనీబీఏపి.**

గ్రామాల్లోని సాంకేతిక ఆవిష్కరణలను సాంప్రదాయ పరిజ్ఞానాన్ని శోధించే 6వ జాతీయ ద్వైవార్షిక పోటీలు

# సాంకేతిక ఆవిష్కరణ

## దరఖాస్తు

జ్ఞానకర్త పేరు : ____________________

సమాజం పేరు : ____________________

(జ్ఞానం సమాజానికి సంబంధిస్తే)

చిరునామా : ఊరు : ____________________

పోస్టు : ____________________

మండలం : ____________________

జిల్లా, రాష్ట్రం : ____________________

పిన్ : ____________________ టెలిఫోన్ : ____________________

దగ్గరి పట్టణం : ____________________

స్త్రీ/పురుషుడు : ____________________ వృత్తి : ____________________

ఆవిష్కర్త వివరాలు : ____________________

ఆవిష్కరణ పేరు : ____________________

ఆవిష్కరణకు మూలకారణం : ____________________

ఆవిష్కరణ వివరాలు : ____________________

**స్కౌట్ సంతకం :** **జ్ఞానకర్త సంతకం :**

**పేరు :** **పేరు :**

గ్రామాల్లోని సాంకేతిక ఆవిష్కరణలను సాంప్రదాయ పరిజ్ఞానాన్ని శోధించే 6వ జాతీయ ద్వైవార్షిక పోటీలు

# సాంప్రదాయ విజ్ఞాన

## దరఖాస్తు

**విభాగం - 1**

జ్ఞానకర్త పేరు : ______________________

సమాజం పేరు : ______________________

(జ్ఞానం సమాజానికి సంబంధిస్తే)

చిరునామా : ఊరు : ______________________

పోస్టు : ______________________

మండలం : ______________________

జిల్లా, రాష్ట్రం : ______________________

పిన్ : ______________ టెలిఫోన్ : ______________

దగ్గరి పట్టణం : ______________________

స్త్రీ/పురుషుడు : ______________ వృత్తి : ______________

జ్ఞానకర్త వివరాలు : ______________________

______________________

______________________

______________________

______________________

**విభాగం - 2**

మూలికల ఉపయోగం : ఆరోగ్యం | పశు ఆరోగ్యం | క్రిమి సంహారిణి | ఇంకేదైనా ______________

వాడేవిధానం :

వాడిన మూలికల పేర్లు :

| | వాడుక నామమం | ఆంగ్లంలో పేరు | శాస్త్రీయ నామం |
|---|---|---|---|
| 1. | | | |
| 2. | | | |
| 3. | | | |

వాడిన మూలికల భాగాలు : ______________________

మోతాదు : ______________________

**స్కౌట్ సంతకం :** **జ్ఞానకర్త సంతకం :**

**పేరు :** **పేరు :**

# హనీబీఏపి అంతరాత్మ పల్లె సృజన

'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' సంస్థ లక్ష్యాలను సాధించటానికి 'హనీబీ' (తేనెటీగ) అనే పేరుతో ఒక యంత్రాంగం రూపొందించ బడింది. తేనెటీగ అత్యుత్తమ నిస్వార్థ ప్రాణి. పూలల్లో వున్న మకరందాన్ని ఆస్వాదించి, తన శ్రమతో దాన్ని తేనెగా తయారు చేసి మానవాళికి అందజేస్తుంది. పువ్వుకు నష్టం వాటిల్లకుండా, ప్రజానీకానికి లాభమయ్యేట్లుగా చాకచక్యంతో కార్యాన్ని నిర్వర్తిస్తుంది. ఈ తేనెటీగ జీవన సరళియే ఉద్దేశ్యంగా 'హనీబీ' స్వచ్ఛంద సంస్థ మరుగున పడివున్న గ్రామీణ ప్రాంతాలలో సాంప్రదాయ కంగా వాడే పద్ధతులు, సృజనాత్మక ఆలోచనలను వెలికి తీయడానికి కృషి చేస్తున్నది. ప్రజల నుండి మనం ఏదైనా జ్ఞానాన్ని సేకరించినపుడు, వారు గరీబులుగా మారకూడదు. వారి అంతరాంతరాల్లోని ఆలోచనల్ని మనతో పాలు పంచుకొన్నపుడు వారికి అంతో ఇంతో లాభం జరగడం సబబు. అందుకే మనం వారి సరికొత్త ఆలోచనలను వారి స్థానిక భాషలోనే చర్చించాలి. వారికి తగిన సమాచార సామగ్రిని అందించాలి. సరికొత్త ఆలోచనల్ని మన ముందు వెల్లడిస్తున్న వ్యక్తికి ఆ ఆలోచనలతో మనమేమి చేస్తామో తెలియాలి. వారి పరిజ్ఞానాన్ని విస్తారం చేయడం ద్వారా ఎంతో కొంత ఆదాయాన్ని వారికి సమకూ ర్చాలి. ఇది వీలైనంత పారదర్శకంగా ఉండాలి.

ప్రజల మధ్య అభ్యాసానికి 'పల్లెసృజన' ఒక ప్రయోగం వంటిది. మనం ఇంగ్లీషులో రాస్తాము. అది ప్రపంచమంతటికి వ్యాపిస్తుంది. కానీ, స్థానికులను పరాయివారిని చేస్తుంది. మనం ఎక్కడినుండి నేర్చుకున్నామో అక్కడికి చేరుకోలేము. ఒకవైపు మనం ఎదుగుతూ వుంటాం. కెరీర్‌లో ఒక్కొక్క శిఖరాన్ని అధిరోహి స్తాము. వృత్తి సంబంధమైన పురస్కారాల్ని అందుకుంటాము. ఇదే సమయంలో మన ఆలోచనలలో భాగస్వామి అయిన స్థానికుడు బాధలు పడతాడు. మౌనంగా వేదనకు లోనవుతాడు. విజ్ఞాన సేకరణ, దాన్ని పేపర్ పైన వ్రాసి పంపడం (డాక్యుమెంటేషన్) ఆ విజ్ఞానాన్ని నలుదిశలా వ్యాప్తిలోకి తేవడం, వాటికి సిద్ధాంత రూపాల్ని కల్పించడం, సంస్థలకు పరిచయం చేయడం, నైతిక సూత్రాల పాటింపు, హనీబీ ఆలోచనల్లో ప్రధానమైనవి. ఈ విజ్ఞానాన్ని విస్తారంగా వ్యాప్తి చేయడానికి 'పల్లెసృజన' తెలుగు నాట కృషి చేస్తున్నది.

'హనీబీఏపి యంత్రాంగానికి చేయూతను అందించాలి' అనుకున్నట్టయితే మీరు మా పత్రిక వార్షిక చందా లేదా జీవిత కాలపు చందాతో ముందుకు రండి. మీ సృజనలను, ఆలోచనలను మాకు ప్రచారానికై పంపండి. స్వచ్ఛందంగా కేవలం పల్లె ప్రజల వికాసానికై పాటుపడుతున్న ఈ పత్రిక మీదిగా భావించి మీ మిత్రులను అభ్యుదయ భావాలున్న వ్యక్తులను చందాదారులు గా చేర్పించడం ద్వారా మీరు కూడా పల్లె విజ్ఞానాన్ని ప్రపంచానికి తెలియజేయ డానికి మీవంతు కృషి చేయ గలరని ఆశిస్తున్నాము.

## చందా వివరాలు

| | వ్యక్తిగతంగా | సంస్థ లేదా లైబ్రరీకి |
|---|---|---|
| సంవత్సర చందా | 100/- | 1,000/- |
| జీవిత చందా (15 సంవత్సరాలు) | 1,000/- | 10,000/- |

**మీ చందాలను డి.డి. / మనీ ఆర్డర్ /చెక్కుల రూపంలో పంపవలసిన చిరునామా**

**శ్రీమతి అరుణ గణేశం**
అసోసియేట్ ఎడిటర్, పల్లెసృజన, 102, వాయుపురి, సైనికపురి పోస్టు,
సికింద్రాబాద్ – 500 094.
**ఫోన్ : 040-27118555**

## 'పల్లెసృజన' వార్షిక చందా కాలం ముగిసినట్లయితే మీ చందాను కొనసాగించమని కోరుతున్నాము.

– ఎడిటర్